ప్రజాశక్తి

Vol. 7, no. 10

(Sept. 5, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 7, no. 10

(Sept. 5, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 7 బుధవారం 5-9-45 సంచిక 10

సంపాదకీయం:

రాజకీయ ఖైదీలను విడుదలచేయాలి

మిత్రరాజ్యాల విజయంతో యుద్ధం ముగిసిపోయింది. కాని ప్రభుత్వం యింకా కొంతమంది రాజకీయ ఖైదీలను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కపెడుతూంది. మద్రాసురాష్ట్రంలో అనేకమంది డిటెన్యూలుగాను, శిక్షితులుగాను జైళ్ళలో మ్రగ్గుతున్నారు. ప్రభుత్వం యీ విధంగా ఆలస్యం చేయడంలో అర్థంలేదు. దేశంలో శాంతి, సుహృద్భావం నెలకొందాలంటే ప్రభుత్వం వెంటనే రాజకీయ ఖైదీలందరను విడుదల చేయాలి.

అల్లూరి సత్యనారాయణ, ఎ. యస్. కె. అయ్యంగారు, సర్దార్ చంద్రోత్ వగైరా కమ్యూనిస్టు సోదరులు దాదాపు ఐదు సంవత్సరాలుగా జైళ్లలో నిర్బంధింపబడ్డారు. వీరి నిర్బంధం నిర్నిమిత్తమైనదను విషయం లోకవిదితం. అనేకమంది రాజకీయ బందీలు విడుదలయ్యారు. అనేక మందికి పెరోలు దొరికింది. కాని ప్రభుత్వం కక్షతో వీరికి మాత్రం ఎట్టి అవకాశం యివ్వక జైళ్లలో నిర్బంధించింది. ఈ విధముగా మద్రాసు ప్రభుత్వం తీరని అపరాధం చేసింది. ఇప్పటికైనా సి. ఐ. డి. ల రిపోర్టులను, సాకులపై ఆధారపడక వెంటనే యీ కామ్రేడ్సును ప్రభుత్వం విడుదల చేయాలి.

మద్దూరి అన్నపూర్ణయ్య, కాకరాల కామేశ్వరరావులాంటి రాజకీయ బందీలు ఐదు యేండ్లనుంచి జైళ్ళలో మ్రగ్గుతున్నారు. వీరు చాల కాలంక్రిందటే ఫార్వర్డుబ్లాకుకు రాజీనామా యిచ్చారు. మిత్రరాజ్య విజయంకొరకు కృషిచేయడం దేశభక్తుల ధర్మమని ప్రకటించారు. ఐనప్పటికి ప్రభుత్వం వదలలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండితనం వదలి వెంటనే వీరిని విడుదల చేయాలి.

ఇక ఆగస్టు ఘటనలలో శిక్షితులైనవారు 4 వందలదాకా ఆలిపురం క్యాంపు జైలులో వున్నారు. ఒకపుడు ఫార్వర్డుబ్లాకు రాజకీయాలను అనుసరించినవారు కూడ డిటెన్యూలుగా వున్నారు.

నేడు యుద్ధం ముగిసిపోయింది. అరెస్టులు జరిగిననాటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. భారత రాజకీయ ప్రతిష్టంభన తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొత్త ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభమవుతున్నాయి. ఇలాంటి సమయంలో ఏరాజకీయాభిప్రాయాలకు చెందినవారినైనా జైళ్ళలో వుంచడంలో అర్థంలేదు.

కాబట్టి మద్రాసు ప్రభుత్వం రాజకీయ ఖైదీలందరినీ వెంటనే విడుదల చేయాలి. నిర్బంధ శాసనాలను రద్దు చేయాలి. పౌరసత్వ హక్కులను కలుగజేసి దేశంలో శాంతి, సుహృద్భావం కలుగజేయాలి.

ఎన్నికలపట్ల ★ కాంగ్రెసు, లీగ్ దృక్పథాలు

— జి. అధికారి

త్వరలో ఎన్నికలు జరుగనున్నాయి. కేంద్రశాసన సభకు యీ సంవత్సరాంతంలోను, రాష్ట్ర అసెంబ్లీలకు వచ్చే సంవత్సర వేసవికాలంలోను, ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. అన్ని రాష్ట్రాలలో కాంగ్రెసుపై నిషేధం తొలగించింది. ఆగస్టు ఘటనలలో జైళ్ళకు పంపబడిన వారందరినీ వేగంగా విడుదల చేస్తోంది. తిరిగి సంప్రదింపులు సాగించడానికి లేబర్ ప్రభుత్వం వైస్రాయిని లండను పిలిపించింది.

యుద్ధం సమాప్తమైన వెంటనే యివన్నీ జరగటం శుభసూచకం. ప్రజాసామాన్యానికొక ఆశారేఖ గోచరిస్తోంది.

లేబరు ప్రభుత్వం భారతీయుల స్వాతంత్ర్య వాంఛను యీడేర్చడానికి, తాత్కాలిక పరిష్కార మార్గానికి, కొన్ని కొత్త సూత్రములు చేస్తుందని మన జాతీయ పత్రికలన్నీ ఆశతో యెదురు చూస్తున్నాయి. కాని, యీ రెండిటిమీద కాంగ్రెసునాయకులూ - లీగ్ నాయకులూ పరస్పర వ్యతిరేకమైన దృక్పథాలలో ఉన్నారు.

ఇప్పుడు తాత్కాలికంగా కేంద్రంలో కొత్త ప్రభుత్వమేదీ యేర్పడకూడదని ముస్లింలీగ్ నాయకత్వం, లీగ్ పత్రికలు ఘోషిస్తున్నాయి. రానున్న ఎన్నికలలో తమ ప్రతినిధులే అధికసంఖ్యాకులుగా ఎన్నుకోబడతారనీ, అప్పుడు పాకిస్థాన్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే శక్తిని సంపాదించుకొన గల్గుతామనీ, వారి అభిప్రాయం. అంతేకాదు. ఈ మధ్య బొంబాయిరాష్ట్ర ముస్లింలీగ్ వర్కింగ్ కమిటీ జిన్నాగారిసమక్షంలో సమావేశమైనప్పుడు, కాంగ్రెసువారు మెజారిటీలో ఉన్న రాష్ట్రాలలో గవర్నర్లు మంత్రివర్గాల నేర్పరచడం అన్యాయమని ప్రకటిస్తూ తీర్మానించింది. "వివిధరాష్ట్రాలలో పాలకాసన సభలను రద్దు చేయవలసిన యీ సమయంలో కాంగ్రెసుపార్టీని అధికారంలో కూచో పెట్టడమంటే, యితర పార్టీలపట్ల అపచారం చేయడమే" అంటూ ప్రభుత్వ ప్రయత్నాన్ని ఖండించింది. (ఆగస్టు 28)

అంటే అర్థమేమిటి? ఇప్పుడున్న ఎడ్వైజర్లు రాబోయే ఎన్నికలలో అన్ని పార్టీలవారికీ న్యాయం కలుగజేస్తారనీ, వోటర్ల హక్కులను కాపాడుతారనీ, లీగ్ నాయకులకు విశ్వాస మున్నమాట! కాంగ్రెసు మంత్రులకంటె ఎడ్వైజర్లే ధర్మపరిపాలన చేస్తారన్నమాట!

ఇక కాంగ్రెసు వర్గాల్లో ఎట్టి అభిప్రాయాలున్నాయో చూద్దాం. దాదాపు కాంగ్రెసు పత్రికలన్నీ, కేంద్రంలోను రాష్ట్రాలలోను వెంటనే తాత్కాలికంగా ప్రజా ప్రతినిధుల ప్రభుత్వాలు ఏర్పడాలని వ్యాఖ్యానిస్తున్నాయి. కాంగ్రెసువాదులకు మెజారిటీ ఉన్న మద్రాసువంటిరాష్ట్రాల్లో కాంగ్రెసు మంత్రులకు అధికారం వొప్పజెప్పాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాయి.

ఎన్నికలలో ప్రజాభిప్రాయం వెల్లడి కావాలంటే, అన్ని పార్టీలకూ పూర్తిగా పౌరసత్వ హక్కులు ఉండాలి. సభాస్వాతంత్ర్యం, ప్రచారస్వాతంత్ర్యం అందరికీ ఉండాలి. రాజకీయ ఖైదీలందరినీ విడుదలచేయాలి. రెండవ విషయం: ఎన్నికల యేర్పాట్లు అన్ని పార్టీలవారికీ సమ్మతమైన ఒక్క కమిటీ చేతుల్లో ఉంటే బాగుంటుంది. యీ రెంటినీ ఇప్పుడున్న నిరంకుశాధికారవర్గం ప్రసాదిస్తుందనుకోవడం వట్టి భ్రమ. అయినా, లీగ్ నాయకులు అట్టి అధికారవర్గం మీదే ఆశలు పెట్టుకొన్నారు. కాంగ్రెసు మంత్రివర్గాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇలా వ్యతిరేకించడంవల్ల ప్రభుత్వానికొక సాకు దొరుకుతోంది (ఎడ్వైజర్ల పరిపాలనను కొనసాగించడానికి). మరొకవైపు, కాంగ్రెసు నాయకులు లేబర్ ప్రభుత్వంమీద ఆశలు పెట్టుకొని కూచున్నారు. నిరంకుశాధికారవర్గాన్నీ, ముస్లింలీగునీ, లేబర్ ప్రభుత్వం తోసిరాజనాలని దానిపై ఆధారపడి ఉన్నారు. ముస్లింలీగుని ప్రతిరోజూ సామ్రాజ్యవాదుల ముద్దుబిడ్డ అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. ఈపరిస్థితుల్లో బహుశా, లేబర్ ప్రభుత్వం లీగ్ యొక్క వ్యతిరేకతకు యెదురీదక పోవచ్చు. (అప్పుడే కొన్ని రాష్ట్రాలలో అసెంబ్లీలను గవర్నర్లు రద్దుచేశారు)

కాంగ్రెసుపట్ల ముస్లింలీగ్ నాయకులకు, లీగ్‌పట్ల కాంగ్రెసునాయకులకు, ద్వేషంవిపరీతంగాఎక్కువైపోయింది. కాంగ్రెసు మంత్రులు అధికారంలోకివచ్చాక, అన్ని పార్టీలవారికీ ప్రాతినిధ్యంఉన్న పార్లమెంటరీ కమిటీలనువివిధ రాష్ట్రాలలోనిర్మించి ఎన్నికల యేర్పాట్లన్నీఆకమిటీకిస్వాధీనంచేస్తామనిహామీయిస్తే, ముస్లింలీగ్‌యొక్క వ్యతిరేకతఉండదు. ఎడ్వయిజర్ల పరిపాలనను సులభంగాఅంతమొందించవచ్చు. కాని ఇలాంటిధోరణి కాంగ్రెసునాయకుల్లోలేదు. తమ సోదరపార్టీల సహకారంతో నిమిత్తం లేకుండా, అభివృద్ధి నిరోధకులైన నిరంకుశాధికారవర్గంమీద ఆధారపడ్డంవల్ల మంత్రివర్గాల నేర్పరచవచ్చునని భావిస్తున్నారు.

మరొకవైపు లీగ్ నాయకత్వం, తన వ్యతిరేక ధోరణితో ఎడ్వయిజర్ల అధికారవర్గానికి బలం చేకూరుస్తోంది.

ఇట్టి వాతావరణంలో మౌలానా ఆజాద్, స్వతంత్ర భారత దేశం యొక్క రాజ్యాంగ ప్రణాళికను తయారుచేయడానికి యీ మధ్య ఒక కొత్తసూచన గావించారు. దాన్ని నెహ్రూ, అసఫాలీ, గఫూర్‌ఖాన్‌లు బలపరుస్తున్నారు. రేపు జరుగబోయే వర్కింగ్‌కమిటీ సమావేశం కూడా యీ సూచనను ఆమోదించవచ్చు. దీని ప్రకారం: భారత రాజ్యాంగంలో యిప్పుడు భాగాలుగాఉన్న వివిధ ప్రాంతాలు భారత సమాఖ్యలో కలిసిఉండడమా? లేక విడిపోవడమా అనే సమస్యను ఆ ప్రాంతం నుంచి ఎన్నుకోబడు ప్రతినిధులు నిర్ణయించుకుంటారు. అయితే, యావత్ భారతదేశ శ్రేయస్సుకు సంబంధించిన కొన్ని షరతులకు లోబడి ఆ నిర్ణయాలుండాలి. ఈ ప్లాను ద్వారా పాకిస్తాను సమస్యను సంతృప్తికరంగా పరిష్కరించడానికొక ప్రజాస్వామ్యపద్ధతిని అమల్లో పెట్టడం కష్టసాధ్యమైన పనిగాదు. స్వాతంత్ర్యసాధన కవసరమైన కాంగ్రెసు - లీగ్ ఒడంబడిక సులభంగా చేకూరేది. అందుకు, ఈ ప్లానులో కొన్ని ప్రధానాంశాలు చేర్చియుండాల్సింది.

1. ప్రజా పరిషత్తు సభలకు ఎన్నికలు వయోజన వోటింగుపద్ధతిపై జరుగుతాయనీ, ప్రత్యేక నియోజక వర్గాలుంటాయనీ, ప్రపోర్షనల్ రిప్రజంటేషను విధానం అమల్లో ఉంటుందనీ, వ్యక్తపరచవలసింది.

2. ఒకేభాష, సంస్కృతి, సాంప్రదాయం, యితరలక్షణాలుగల ప్రతి ప్రాంతానికి ఒక్కొక ప్రజాపరిషత్తు సభ ఏర్పడుతుందని హామీ యివ్వవలసింది.

3. ఇలాంటి ప్రజా పరిషత్తుసభలు కొత్త రాజ్యాంగ చట్టాన్ని తయారు చేయునపుడు భారత సమాఖ్యలో చేరడమా, మానడమా? అను సమస్య పై నిర్ణయించుకోడానికి సంపూర్ణ స్వాతంత్ర్యం ఉంటుందని (షరతులు లేకుండా) ప్రకటించియుండ వలసింది.

అనేక స్వాతంత్ర పోరాటాల ఫలితంగా మన దేశంలో నివసించే వివిధప్రాంతాల ప్రజల్లో జాతీయ చైతన్యం వెల్లివిరుస్తోంది. ఆంధ్రులు, బెంగాలీలు, మహారాష్ట్రులు, కన్నడులు - ఇలా వివిధజాతుల ప్రజలంతా తమ అభివృద్ధికి అనుగుణ్యమైన రాజ్యాంగ చట్టాలు తయారు చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నారు. ఇందుకు ప్రజాపరిషత్తు సభలే సాధనం.

(మిగతా 12 వ పేజీలో)

'బోసు చల్లనిచూపు'

ఈమధ్య ఏ పత్రిక చూచినా, సుభాష్ చంద్ర బోసుకి అశ్రుతర్పణాలతో నిండి ఉంటూంది. కాంగ్రెసు నాయకులందరూ అతనికోసం టొటటొట కన్నీళ్ళు కార్చారు. ప్రపంచ ప్రజల శత్రువుగా తాము భావించిన ఫాసిస్టు పక్షంలో అతను చేరడం ఒక చిన్న పొరపాటుగా చిత్రించేశారు. అన్నెము పున్నెము ఎరుగని అమాయకుడు కాడు, బోసు. వివిధ ప్రభుత్వాల విజస్వరూప మెరిగినవాడు. అతను చేతులు కలిపిన జపానుకిరాతకు లెలాంటివారో, వారితో కలిసి అతనెంతదూరం వెళ్ళాడో ఈ దిగువ ఉదంతాలవల్ల తెలుస్తుంది.

●

జి. యల్. సుబ్బా ఒక గూర్ఖాశాస్త్రేడ్. జపానువారి ఖైదు శిబిరాల్లోంచి బయటపడి వచ్చినవారిని కలుసుకొని, అతనీక్రింది విషయాలు తెలియజేశాడు. వీరిలో ఒకతను ఇతనికి దగ్గరచుట్టం. 1942 లో మరో ఇద్దరితో కలిసి ఖైదుశిబిరంలోనుంచి తప్పించుకొని వచ్చారు. అతని కథ ఇది :

"మేము ఏడుగురం గూర్ఖాలము. వలను మంది బ్రిటిష్‌వారు. జపానువారికి పట్టుబడ్డాం. మమ్మల్నందర్నీ ఒకే శిబిరంలో ఉంచారు. అవేళ ఎండ మహా తీక్ష్ణంగా ఉంది. "ఆ ఎండలో జపానువారు కొందరు ఖైదీలను బయటికి లాగారు. వారి బట్టలన్నీ ఊడదీశారు. హోయలేని బరువును వారి మూపులపై పెట్టి, నడుగెత్తమన్నారు. నడుగెత్తలేక పడిపోయిన వారిని మిలిటరీ బూట్లతో తన్నారు. లాఠీలతో బాదబాదారు. ఆ దెబ్బలకు వారి శరీరాలూ, ముఖాలూ చూస్తుండగానే వాచి, ఉబ్బిపోయాయి. ముక్కుంటా, నోటంటా రక్తం బొటబొటా కారింది. ఆదృశ్యం చూడలేకపోయాం. కాని, జపాను సైనికులు పైశాచికాట్టహాసాలతో, పట్టరాని ఆనందంతో, నవ్వుతుంటూ వెళ్ళారు.

చిత్రవధలు

"మా గూర్ఖా ఖైదీల్లో ఒకరుండేవాడు. చాల అందమైనవాడు. మిలిటరీ దుస్తులు వేస్తే అచ్చంగా దొరలాగే ఉండేవాడు. మొదటి రోజు చేసినట్లే రెండోరోజున అతనికి కూడా చేయాలను కున్నారు జపానువారు. కాని అతను లొంగలేదు. ఇక ఆ జపాను పశువులు ఉగ్రులయారు. అతన్ని గుడ్డలూడదీసి, ఒక కొయ్యకు కట్టారు. పదునైన కత్తులతో అతని చర్మాన్ని మెల్లమెల్లగా, నవ్వుకుంటూ, చెక్కివేయడం ప్రారంభించారు. మా కడుపులో చేయిపెట్టి కలచినట్లయింది, రక్తం ఉడికిపోయింది. కాని అశక్తులం. ఆ పోదరుడికి అశ్రుతర్పణలిచ్చి మోహం తిప్పేసుకున్నాం. ఆ దృశ్యం మా కళ్ళ ముందర నుంచి ఎన్నటికీ చెదిరిపోదు.

'ఆసియాఖండం ఆసియావాసులకే' అనీ, "ఆసియా సిరిసంపదలను అందరం సరిసమానంగా పంచుకొందా"మనీ జపానువారు చేసిన ప్రచారంయొక్క బండారం అప్పుడు మాకర్థమయింది. మొదట్లో మేము వారి మాటలు కొంతవరకు నమ్మాము. ఇక తప్పించుకు పారిపోవడమే గత్యంతరమని నిశ్చయించుకున్నాం."

జపాను ఖైదుశిబిరంలో 3½ సంవత్సరాలు గడిపిన ఒక గూర్ఖా తనకథ చెప్పాడు. ఇతను రంగూను తిరిగి మిత్రసేనల వశమయిన తరువాత బయటపడ్డాడు.

"మమ్మల్నందర్నీ కలిపి 800 మందిని ఒక శిబిరంలో పెట్టారు. చాలమంది పంజాబీలు. బ్రిటిష్‌వారు కూడా ఉండేవారు. మండు టెండలో మా చేత బండచాకిరీ చేయించేవారు. జపాను సైనికుల ఓడల్లోని బరువంతా దింపించేవారు. రోడ్లను తుడిపించేవారు. బర్మా ప్రజలఎదుట మమ్మల్ని నీచంగా 'అవమా నించేవారు. ఏదో ఒక మిషపెట్టి, జైలు నిబంధనలకు భంగం కలిగిందంటూ మహా క్రూరంగా శిక్షించేవారు.

శిక్షించేపద్ధతి

"ఈ శిక్షించడం అనేకరకాలుగ ఉండేది. మొదటిరకం—'నేరస్తుడిని' మండుటెండలో ఒకకొయ్యకు కట్టివేసి, నీళ్ళయినా ఇవ్వకుండా రోజంతా ఉంచడం. నేనొకసారి అలాంటి శిక్షను అనుభవించాను. రెండోరకం-రోజులు తరబడి, ఒక్కొక్కసారి 15 రోజుల వరకు పస్తు పెట్టడం. మూడవ రకం - నేరస్తుడి కాళ్ల-చేతులు కట్టేసి, ఒక దీపపు స్తంభానికి వేళ్లాడగట్టి చుట్టూ మంటలు పెట్టడం. మంటలు తగిలి అభాగ్యుడు సాధారణంగా చస్తుంటాడు.

"ఇక రాజకీయ నేరాలకు వేసే శిక్షల సంగతి వేరే చెప్పనక్కరలేదు. జపానువారి దృష్టిలో రాజకీయ నేరాలంటే ఏమిటో వారికే తెలియాలి; ఆభగవంతుడికే తెలియాలి. ఒక నోటుబుక్కు, పెన్సిలు ఉండడం కూడా రాజకీయ నేరమే ఇలాంటి నేరాలకు ఖైదీలగోళ్లు పీకివేయడం. సర్వసాధారణ శిక్ష. వేళ్ళు, చేతులు నరికివేయడం కూడా తరుచు జరుగుతూంటుంది. మూడోరకం శిక్ష - నేరస్తుడి తల నరికి, దానిని ఊరంతా తిప్పేవారు-ఇతరులకు హెచ్చరికలాగా, అన్నిటికన్నా ఘోరమయింది నాలుగోరకం: నేరస్తుడిని అర్ధగా పేంగట్టి, మైనపువత్తులతో కొద్దికొద్దిగా కాల్చి చంపేవారు.

అర్థమాలిన చెత్తా

"ఇక మాకుపెట్టే తిండిసంగతి చెబుతాను. అన్నం పెట్టేవారు. దానితో, ఏ ఆకో, ఏగడ్డో, కనబడితే అదితెచ్చి-ఉప్పుతో ఉడకబెట్టి పెట్టేవారు. యేము హిందువులమట, అందువల్ల 'కాయకూరలే' తినాలట. అస్సాంలో ఓడిపోవడం ప్రారంభమయిన దగ్గర్నుంచి మా భోజనం విషయం మరీ అధ్వాన్నమయింది. మాప్రాణాలను నిలబెట్టింది మందివిళ్ళే అని చెప్పగలను"

బోసు చల్లనిచూపు

ఆ తరువాత ఒకనాడు సుభాస్ చంద్రబోసు రావడాన్ని గురించి ఇలా చెప్ప నారంభించాడు. "నేతాజీ-మార్షల్ అని బిరుదులు తగిలించుకొని బోసు తన సైన్యానికి మనుషుల్ని పోగుచేయడానికి వచ్చాడు."

"మన్నుబోసుని ఎలాగుర్తుపట్టగలిగావు?" అని నేనతన్ని అడిగాను.

"బోసుని నేను ఫొటోల్లో చూచాను" అని జవాబు చెప్పాడు.

"అర్థరుబట్టలు తొడుక్కున్నాడా?"

"అదేమీలేదు. తన 'మార్షల్' మిలిటరీ దుస్తులే ధరించాడు. అతనివెంట అతని డిప్యూటీ కమాండరట ఒక గుజరాతీ అతను కూడా ఉన్నాడు. వాళ్ళిద్దరూ రావడంతో మమ్మల్నందర్నీ వరుసగా నిల్చోమన్నారు. తన సేనలో చేరమని కోరుతూ బోసు హిందూస్థానీలో చాలసేపు మాట్లాడాడు. బ్రిటిషు వారిని తెగతిట్టాడు. వారినెత్తురు తాగేవరకు శాంతింపనన్నాడు. మా గూర్ఖాలకు ప్రత్యేకంగా నచ్చచెప్పబోయాడు. ప్రస్తుతం నేపాల్ బ్రిటిష్‌వారి చేతిలో కీలుబొమ్మ. తానువస్తే నేపాలుకి పూర్తిస్వాతంత్ర్యం ఇస్తాడట. మా శిబిరంలో ఉన్న 250 మంది పంజాబీవాళ్ళు బోసు సేనలో చేరారు. మేము నిరాకరించాం.

"బోసు, అతని గుజరాతీ డెప్యూటీకమాండరు, వారి జపానుమిత్రులు ఇందుకు మాపై పైశాచికంగా పగ సాధించారు. మిమ్మల్ని చిత్రవధ చేయమని ఆ గుజరాతీవాడు జపాను సైనికులకు ఉత్తరుపిచ్చాడు. పశువుల్ని బాదినట్లు మమ్మల్ని బాదారు జపానుధాతకులు. మా ముక్కుల్లోంచి, నోటవెంట నెత్తురు కాల్వలుకట్టింది. మా శరీరాలు దెబ్బలకు ఉబ్బిపోయాయి. అలా కొట్టిన తరువాత మమ్మల్ని మూడువారాలు పస్తులుంచారు. మాదెబ్బలకు మందూ మాకూలేదు. కొందరికైతే ఆ గాయాలు పురుగులుపట్టాయి. చాలమంది అలా కుళ్ళికుళ్ళి చచ్చిపోయారు.

"ఆచిత్రవధ, దానికి కారకులైన బోసుని, అతని డెప్యూటీని ఎన్నటికీ మరచిపోము!"

'కాల్చి చంపుతాను'

"బోసు తిరిగివస్తే ఏంచేస్తావు?"

కాల్చి చంపుతాను. ఆది మమ్మాటికి నిశ్చయం. మా గుండెల్లో మానని గాయం పెట్టాడతను. అతనిగుజరాతీ డెప్యూటీ కోసం అన్నిచోట్లా వెతికాము కనబడితే పట్టిచంపాలనుకున్నాం. కాని వాడూ, వాని యజమాని అప్పటికే పారిపోయారు!! కాని, ఏనాటికైనా దొరక్కపోతారా!"

★

బోసు "పొరపాటుపడిన దేశభక్తుడు" ట! అతని కోసం 'కన్నీళ్లు' కార్చడం, అశ్రుతర్పణలివ్వడం ఎంతవరకు సమంజసమో ఆలోచించండి.

28—8—45 ('పీపుల్సువార్' నుండి)

ఈ ఫిర్యాదీ లెట్టివారు?

●

[చింతగుంటపాలెంలో జూలై 15 వ తేదీన జరిగిన వితంతు వివాహం సందర్భంలో కమ్యూనిస్టులు పల్లెమీద దౌర్జన్యం చేశారంటూ దినపత్రికలలో వార్తలు వచ్చాయి. ప్రాసిక్యూషన్ సాక్ష్యం పూర్తియై, బందరు స్పెషల్ ఫస్ట్‌మేజస్ట్రేటుగారు బొగాదులకనకరత్నం వగైరా ముగ్గురు స్త్రీలను కేసునుండి విడుదలచేస్తూ, పింగళి పెట్టి శివరామయ్య యింకా 8 మందిమీద కేసుచార్జీ చేసినారు. ఈ కేసులోని ఫిర్యాదీలు క్రాస్ పరీక్షలో ఈ క్రింది విధంగా చెప్పినారు :]

మద్దుల సుబ్బారావు - ఫిర్యాది దెబ్బలుతిన్న అతను

ముద్దాయీల తరపు వకీలు : నీవు నూలు వ్యాపారం చేస్తావా ?

మ. సు. : ఆ. చేస్తాను.

ము. వ. : నీవు నూలుయిచ్చి బట్టలు నేయిస్తావా ?

మ. సు. : యిప్పుడు నేయించుటలేదు.

ము. వ. : ఎంతకాలంనుండి?

మ. సు. : సుమారు 10నెలల నుండి

ము. వ. : మీ పేటలో చేనేత పారిశ్రామికులకు కోఆపరేటివ్ సొసైటీపెట్టి కమ్యూనిస్టులు నేతనేసినందుకు ఎక్కువ కూలి యిస్తున్నారా ?

మ. సు. : నాకు తెలియదు.

ము. వ. : నీవు ముందనుంచుకొన్నావా ?

మ. సు. : ఆ. 12 సంవత్సరాలనుండి ముందతో వుంటున్నా.

ము. వ. : నీకు పెళ్లాం పిల్లలూ వున్నారా ?

మ. సు. : ఆ. వున్నారు.

ము. వ. : నీవు వితంతు వివాహాలకు వ్యతిరేకమా ?

మ. సు. : వ్యతిరేకమే.

★

పిండరికోట బసవయ్య - ముద్దాయీలు కొట్టుచుండగా తాను చూచినట్లు సాక్ష్యం.

ము. వ. : నీ చెల్లెలు వితంతువివాహం చేసుకొన్నదా ?

పిం. కో. : ఆ చేసుకున్నది

ము. వ. : నీవు పెళ్ళికి వెళ్ళినావా ?

పిం. కో. : నేను వెళ్ళలేదు

ము. వ. : నీవు వితంతు వివాహాలకు అనుకూలమేనా ?

పిం. కో. : అనుకూలంకాదు

ము. వ. : నీకు జూదం ఆడినందుకు యీ కోర్టులో మేజిస్ట్రేటుగారు శిక్ష విధించారా ?

పిం. కో. : ఆ. శిక్ష విధించారు

★

మహమ్మద్ కాదర్లీ దెబ్బలు తిన్న అతను.

ము. వ. (5 వ ముద్దాయినిచూపి) నీమీద అరమనిషిని చంపినావని తేబడిన కేసులో యీ ముద్దాయి నీకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినాడా ?

మ. కా. : నాకు గుర్తులేదు

ము. వ. : నీ జీవనాధారంపోరాషాపేనా ?

మ. కా. : అదేకాదు. టూత వైద్యంకూడ చేసి సంపాదిస్తా.

తెనాలి రేషనింగు ఆఫీసరు అగౌరవ చర్య

తెనాలి రేషనింగ్ ఆఫీసరు, అసిస్టెంటు రేషనింగు ఆఫీసరు, బియ్యం సోదా చేయడానికి కొన్ని ముస్లిం ఇండ్లకు వెళ్లారు. అక్కడి ఘోషా స్త్రీలను, ముందుగా హెచ్చరించకుండానే, లోనికి వెళ్లారు. ఇది ముస్లింలలో అలజడికి కారణమయింది. 10-8-45న ముస్లింలీగ్ సమావేశమైన, ఈ విషయాన్ని ప్రభుత్వానికి, ఉన్నతోద్యోగులకు తెలియపరచింది. 28-8-45 న రేషనింగు ఆఫీసులో, డి ఆర్ ఓ. గారు విచారణ జరిపారు. లీగ్ కార్యదర్శి మహబూబ్‌గారిని, మరి అతగురిని విచారించి స్టేటుమెంట్లు తీసుకొన్నారు.

అధికారులికనైనా ఇట్టి అగౌరవకరమైన చర్యలు జరగకుండా రేషనింగు ఆఫీసర్లను మందలించాలి.

లీగ్ ప్రాధాన్యాన్ని ఇప్పటికైనా గుర్తించాలి

జపాను కూడా మిత్రరాజ్యాలకు లొంగిపోవడంతో, ప్రపంచ ప్రజలకు బ్రహ్మాండమైన విజయం చేకూరింది. కాని, మనదేశం యింకా బానిసస్థితిలోనే ఉంది. కారణమేమిటి? అని ప్రతివారూ ప్రశ్నిస్తున్నారు. దీనికి నిర్దిష్టమైన జవాబు కాంగ్రెసునాయకులనుంచి రావడం లేదు. అందరూ తలొకవిధంగానూ ప్రకటనలు చేస్తున్నారు.

★

కంభంపాటి సత్యనారాయణ

సిమ్లా సమావేశం విఫలమయాక దేశంలో జరిగిన కొన్ని ఘటనలను విమర్శనాదృష్టితో పరిశీలిస్తే, ఈప్రశ్నకు జవాబు స్ఫురిస్తుంది

కాశ్మీర్ సంస్థానంలో అధిక సంఖ్యాకులు మహమ్మదీయులు. "కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్సు" వారి ప్రధాన జాతీయసంస్థ. దానికధ్యక్షుడైన షేక్ అబ్దుల్లా నాయకత్వం కింద కాశ్మీర్ ముస్లింలు భారత జాతీయోద్యమములో ఒక ప్రముఖస్థానం సంపాదించుకున్నారు. క్రిందటి నెల మొదటివారంలో జవహర్లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్‌లు విశ్రాంతికోసం కాశ్మీర్ వెళ్ళినప్పుడు. వారిద్దరికీ అబ్దుల్లాగారు ఘనమైన స్వాగతం యిచ్చారు. వారి సమక్షంలో జరిగిన "నేషనల్ కాన్ఫరెన్సు"యొక్క వార్షిక మహాసభకు అధ్యక్షత వహిస్తూ, ఆయన యిలా ఉపన్యసించారు :

కాంగ్రెసు - లీగ్ ఒడంబడికయే గత్యంతరం

"మన దేశంలో ప్రధానమైన రాజకీయ పార్టీలు కాంగ్రెసు, ముస్లింలీగ్. ఈ రెండు సంస్థల నాయకులు ఏకాభిప్రాయానికి రావడం ఎంతో అవసరం. ఇలా జరిగితే, 40 కోట్లమంది భారతీయులు తమ నాయకుల పట్ల కృతజ్ఞతను ప్రకటిస్తారు. తక్షణమే వారలా ఎందుకు చేయకూడదు? కాంగ్రెసు-లీగ్ ఒడంబడిక ద్వారానే, మనం సాగించే స్వాతంత్ర్య సమరం జయిస్తుంది."

పై మహాసభలోనే షేక్ అబ్దుల్లాగారు భారతదేశంలో నివసించే వివిధ జాతుల ప్రజలకు స్వయంనిర్ణయాధికారాన్ని ఇచ్చి భారతీయులందరినీ స్వాతంత్ర్య సమరానికి సమీకరించమని కాంగ్రెసు నాయకుల్ని కోరుతూ ఒక తీర్మానం ప్రతిపాదించారు. దానిమీద వాద ప్రతివాదనలు జరిగాయి. చివరకు తీర్మానం అత్యధిక సంఖ్యాకులచే ఆమోదింపబడింది.

"కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్సు" ముస్లింలీగ్‌కి అనుబంధశాఖకాదు; కాంగ్రెసుకీ అనుబంధశాఖకాదు. అయినా, అది ముస్లింలీగ్ కోరే స్వయంనిర్ణయహక్కుపట్ల అనుకూల భావాన్ని ప్రకటించింది! సిమ్లాసమావేశానంతరం అనేక మంది కాంగ్రెసు నాయకులు, లీగ్‌ని పడగొట్టడానికి యితర ముస్లింవర్గాల వారందరినీ సమీకరించపూనుకున్న సమయంలోనే యీ తీర్మానం స్వావయిందంటే, గాలి యెటు వీస్తోందో తెలుసుకోవచ్చు.

హెచ్చరిక

ఆగస్టు 1వ తేదీనజరిగిన బహిరంగసభలో అబ్దుల్లాగారు మౌలానా ఆజాద్‌గారిని సంబోధిస్తూ, యిలా పలికారు :

"కాంగ్రెసు అనేక త్యాగాలు చేసింది. అందులోవున్న ముస్లింనాయకులు పేరెన్నికగన్న ప్రజ్ఞావంతులు. కాంగ్రెసు చేసిన కృషి ఫలితంగా ముస్లిం ప్రజలలో స్వాతంత్ర్య పిపాస ఎక్కువైంది. ఐనప్పటికీ, యీరోజున భారతీయ ముస్లింలందరూ కాంగ్రెసులోలేరు. ఇందుకు కారణమేమో మీరు జాగ్రత్తగా యోచించండి."

మరునాడు, అనగా 2 వ తేదీని, రాష్ట్రపతి ఆజాద్ అబ్దుల్లాగారి అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్లు (వ్యక్తిగతంగా) వారిద్దరి మధ్య జరిగిన సంభాషణవల్ల స్పష్టమవుతోంది. 1937 లో కాంగ్రెసు ముస్లింలీగ్‌తో కలసి వివిధరాష్ట్రాలలో సంయుక్త మంత్రివర్గాల నేర్పరచక పోవడం పొరపాటేనని కూడా ఆజాద్ ఒప్పుకున్నారట. ఆయన ఇటీవల జైల్లోవ్రాసిన "ప్రపంచయుద్ధం" అనే పుస్తకంలో యీవిషయాన్నే స్పష్టంచేసినట్లు తెలుస్తోంది.

ఆగస్టు 15 వ తేదీని మౌలానా ఆజాద్‌తో, "పీపుల్స్‌వార్" విలేఖరి, వివిధ విషయాలపై సుమారు 1 గంటసేపు చర్చించాడు. సంభాషణ పూర్తి అయాక, రాష్ట్రపతి యీ క్రింది సందేశమిచ్చారు :

"దురదృష్టవశాత్తు భారత దేశంలో రాజకీయ విభేదాలు ఏర్పడ్డాయి. వాటిని తొలగించడానికి అందరూ ప్రయత్నించాలి. ప్రతిభారతీయుడు దీనినే తన ప్రధానకర్తవ్యంగాఎంచాలి. మన ప్రధానరాజకీయ సంస్థలను దగ్గరగా తీసుకురావడమే జాతీయవాదుల తక్షణ కర్తవ్యం."

కాంగ్రెసువాదు, ముస్లింలీగర్లు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూ ప్రకటనలమీద ప్రకటనలు చేసే సమయంలో, యీవాక్యాలు అందరినీ ఆలోచించేటట్లు, ఆత్మపరీక్ష చేసుకునేటట్లు, చేయగలవు.

విడిపోయేహక్కుకు రాష్ట్రపతి ఆమోదం

ఈ విషయాన్నిగురించేచర్చిస్తూ మౌలానా ఆజాద్ మొన్న 20 వ తేదీని ఒక ప్రకటన గావించారు. జాతీయైక్యత లేనిదే మన దేశానికి స్వపరిపాలనాధికారం పొందగల శక్తి రాదని అందులో స్పష్టంచేశారు. అంతేకాదు. కాంగ్రెసు తీర్మానంకంటె ఒక అడుగు ముందుకు వేశారు. 1942లో జరిగినవర్కింగ్ కమిటీసమావేశం, ఏప్రాంతీయ ప్రజల్నీ బలవంతంగా భారత దేశఫెడరేషన్‌లో కలుపుకోము అని తీర్మానించింది. ఇప్పుడు ఆజాద్ తన ప్రకటనలో యిలా తెలియజేశారు :

"విడిపోయేహక్కుతో సహా కాంగ్రెసు స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరిస్తుంది. అయితే, ఆయా ప్రాంతాల ప్రజలు యీ సమస్యపై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలి. అలా తెలియజేసే సమయంలో వారిపై యితర ప్రాంతాలవారు యెలాంటి ఒత్తిడి కలుగజేయకూడదు.... ఈ సమస్యపై అంతిమ నిర్ణయాధికారంప్రజాపరిషత్తులోని యావద్భారత దేశసభ్యులకు కాకుండా, ఆప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులకేఉంటుంది."

బలవంతంగా యెవరినీ ఫెడరేషన్‌లో ఉంచమనం - అనడంకంటె, విడిపోయేహక్కు అందరికీఉంటుందనడం తప్పకుండా కాంగ్రెస్ లీగ్ ఐక్యతను దగ్గరకు తెస్తుంది.

లీగ్‌లో వీరెందుకు చేరారు?

కాంగ్రెసువాదులు విమర్శనా దృష్టితో పరిశీలించవలసిన మరొక విషయం : అబ్దుల్ ఖయూం వంటి కాంగ్రెసు నాయకులు ముస్లింలీగ్‌లోఎందుకుచేరారు? అనేది. అబ్దుల్ ఖయూం, సరిహద్దు రాష్ట్రం నుంచి కేంద్ర శాసన సభకు ఎం. ఎల్. ఏ. గా ఎన్నుకోబడి, అసెంబ్లీ కాంగ్రెసుపార్టీకి డిప్యూటీ లీడరుగా ఉన్నారు. ఇటీవల ఆయన రచించిన "పఠాన్ సరిహద్దుపై బంగారం, తుపాకులు" అనే గ్రంథంలో, కాంగ్రెసు కృషి ఫలితంగా సరిహద్దురాష్ట్ర ప్రజలలో రాజకీయ పరిజ్ఞానం, జాతీయ చైతన్యం, ఎలా వృద్ధి పొందుతూ వచ్చాయో వివరించారు. సామ్రాజ్యవాదుల కుటిలనీతిని, విచ్ఛిన్న విధానాన్ని బట్టబయ లొనర్చారు. అంతేకాదు. ఒకేభాష, ఒకే మతం, ఒకే సంస్కృతి, ఒకే సాంప్రదాయం - గలిగిన పఠాన్‌జాతిని బ్రిటిష్ పరిపాలకులు మూడు భాగాలుగాచీల్చి (బెలూచిస్థాన్, సరిహద్దు రాష్ట్రం, ట్రైబల్ ఏరియా) పరిపాలించే పద్ధతిని నిరసించారు. "సంపూర్ణ స్వాతంత్రం గలిగి, సుఖసంపదలతో తులతూగే భారతదేశంలో మా పఠాన్ ప్రజలు కూడ సంపూర్ణ స్వాతంత్ర్యం గల ఒక జాతిగా వర్ధిల్లాలి. అందుకు మేము ఎన్ని త్యాగాలైనాసరే చేయడానికి సిద్ధంగా ఉన్నాం." అని రాశారు.

పఠాన్ ప్రజలలో కలిగిన యీ జాతీయ చైతన్యం కాంగ్రెసు నడిపిన స్వాతంత్ర్య పోరాటాల ఫలితమేనని మనం మరచిపోకూడదు.

ఇవన్నీ గుర్తించిన అబ్దుల్‌ఖయూం కూడ ముస్లింలీగులో చేరడానికి కారణం ఏమిటి? లాహోరులో అతడు ఇలా ఉపన్యసించారు :

"సిమ్లా సమావేశంలో కాంగ్రెసు ముస్లింలీగ్‌ని తోసిరాజని, తానే అధికారం పుచ్చుకోడానికి నిశ్చయించుకున్నట్లు స్పష్టంగా తేలిపోయింది. .... నేను లీగ్‌లో చేరడానికి మరొక కారణం మేమనుకొనేది, హిందూ-ముస్లిం సమస్య పరిష్కరించబడితేనే తప్ప మన దేశానికి స్వాతంత్ర్యం లభించదని నా గట్టి నమ్మకం. కాని, కాంగ్రెసు నేడు లీగ్‌కి వ్యతిరేకంగా చిన్నచిన్న ముస్లిం సంస్థలను ప్రోత్సహించుతోంది. ఈ విధంగా, ముస్లింలీగ్ యొక్క ప్రాముఖ్యతను తగ్గించడం, ముస్లింలలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టడం —— కాంగ్రెసు యొక్క ఆశయంగా కనపడుతోంది. ఇది ముసల్మానులందరికీ నష్టదాయకం."

అబ్దుల్ ఖయూం తరవాత, పంజాబ్ కాంగ్రెసు కమిటీకి కొంతకాలం అధ్యక్షుడుగా ఉన్న మాలిక్ లాల్‌ఖాన్‌గారు కూడా కాంగ్రెసును విడిచిపెట్టి, ముస్లింలీగ్‌లో చేరారు.

అబ్దుల్‌ఖయూం, లాల్‌ఖాన్‌ల వంటి సుప్రసిద్ధ కాంగ్రెసు ముస్లింలే ముస్లింలీగ్‌లో చేరుతున్నారంటే, కాంగ్రెసు నాయకుల పోటీ ఎంత ప్రమాదకరమైన వాతావరణాన్ని సృష్టించిందో గ్రహించాలి.

పంజాబ్ కాంగ్రెసు నాయకుని రాజీనామా

పంజాబ్‌రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి ప్రస్తుతం అధ్యక్షుడుగా వున్న మియాన్ ఇఫ్తీకారుద్దీన్ తన అధ్యక్ష పదవికి రాజీనామా యిస్తూ చేసిన ప్రకటన కూడా కాంగ్రెసువర్గాలలో జ్ఞానోదయం గలిగించాలి. తాను గత 5 సంవత్సరాలనుంచీ కాంగ్రెసు-లీగు ఐక్యతకు కృషిచేస్తున్నానని ఆయన తన ప్రకటనలో తెలియజేశాడు. ఏప్రిల్ 1942 లో జరిగిన అ. భా. కాంగ్రెసు కమిటీ సమావేశంలో, ముసల్మానులకు స్వయంనిర్ణయాధికారం యివ్వాలని రాజాజీ తెచ్చిన తీర్మానానికి అనుకూలంగా వోటుచేశానన్నాడు. కాని, తనకు రాష్ట్ర కాంగ్రెసు కమిటీలో తగినంత అనుకూల వాతావరణం లేకుడున, తనఅధ్యక్షపదవికి రాజీనామాయిచ్చియెక్కువ స్వేచ్ఛగా తన అభిప్రాయాలను ప్రచారం చేయదలచుకొన్నానని చెప్పాడు. ఆయన ఇంకా యిలా అన్నాడు :

"గత 3 సంవత్సరాలలో జరిగిన ఘటనలవల్లను, ప్రతిసారి మనలో నిస్పృహ ప్రవేశిస్తూండడంవల్ల, నా అభిప్రాయాలే సరియైనవని రూఢి అయింది. కరువు, అంటు జాడ్యాలు మన దేశాన్ని తుడిచిపెట్టేస్తున్నప్పుడు, మనం నిస్సహాయులమై చూస్తూ కూచున్నాం. పరిస్థితుల కనుగుణ్యంగా దేశానికి సరియైన కార్యక్రమం ఇవ్వకాలపడిన, కాంగ్రెసులో విచ్ఛిన్నశక్తులు ప్రవేశించాయి. సామ్రాజ్యవాద వ్యతిరేకులందరినీ కూడగట్టుకొని, స్వాతంత్ర్యసాధనకు ముందడుగు వేయకుండా పరస్పర వైషమ్యాలలోను - పోటీసంస్థల నిర్మాణంలోను మనం మన కాలాన్ని వృధాచేస్తున్నాం. కమ్యూనిస్టు వ్యతిరేక దండయాత్ర ఇందుకొక ఉదాహరణ. కాంగ్రెసు నాయకత్వం పరిస్థితులకు తగిన కార్యక్రమం ఇచ్చి, వివిధ జాతుల స్వయం నిర్ణయ సూత్రాన్ని (మిగతా 10 వ పేజీలో)

ప్రజాజీవనంలో విద్యార్థిసంఘాల స్థానం

8వ కృష్ణాజిల్లా విద్యార్థిమహాసభ

పునాదిపాడు చిన్నగ్రామం. విద్యాభిమానమున్న ఊరు. అందుచేతనే చిన్న పూరయినప్పటికీ అగ్రామస్థులు 1922 లోనే చందాలు వేసి ఒక హైస్కూలు స్థాపించుకున్నారు. దాన్ని కమిటీస్కూలుగా కొన్నాళ్లు నడిపి, జిల్లాబోర్డుకు అప్పగించారు. ఈ గ్రామ పెద్దల కృషివల్లనే గ్రామ ప్రజల బిడ్డలకు, బీదలకు సైతం, స్కూలులో చదువుకునే అవకాశం ఏర్పడింది. అది పునాదిపాడు గ్రామానికున్న విశిష్టత. అనేకమంది బాలబాలికలకు ఆగ్రామం విద్యాదానం చేస్తూంది

హైస్కూలు విద్యార్థులు అష్టమ కృష్ణాజిల్లా విద్యార్థిమహాసభను పునాదిపాడుకు ఆహ్వానించారు. గ్రామపెద్దలను వెళ్ళి కలిసికొని మహాసభకు సాయంచేయమని అడిగారు. తాము నాటిన చెట్టు పూవులు, కాయలతో వర్ధిల్లుతూంటే తోటమాలి సంతసించుట సహజమేగదా! అల్లాగే తమ బిడ్డలు జిల్లా విద్యార్థి పండుగ జేసికుంటున్నారు. గ్రామపెద్దలు సంతసంతో సమ్మతించారు.

ఆటంకాలు

కాని యిది కొంతమంది కాంగ్రెసు వాదులకు గిట్టలేదు. 'ఇది జిల్లావిద్యార్థి ఫెడరేషన్ సభ. ఇది కమ్యూనిస్టులది. కాబట్టి జరగకుండా పుల్లలువేయాలి.' తమ ఆటంకాలను ప్రారంభించారు. మద్దాలి జగన్నాధం, వెంకటేశ్వరరావుగార్లు మహాసభను ఈ పూళ్లో జరగకుండా చేయాలని విశ్వప్రయత్నం చేశారు. గ్రామస్థులను పిలచి చెప్పారు. ఇండ్లివ్వ వద్దన్నారు. ఇచ్చిన నాటకహాలును బెదిరించి యివ్వకుండాజేశారు. మహాసభను గూర్చి తెలుపు గోడకాగితాలు చించబడ్డాయి. కొన్నిటిపై పేడకూడ పూయబడింది. కాని విద్యార్థులు జంకలేదు. శాంతంగా తమ కార్యక్రమాన్ని సాగించారు. అనుకున్నదలకు పైగా చందాలు వసూలుచేశారు. గ్రామపెద్దలు సాయపడ్డారు.

ఇలా సాగిపోవడం కాంగ్రెసు నాయకమ్మన్యులకు గిట్టలేదు. గుడివాడలో జరిగిన రాష్ట్ర కాంగ్రెసుఅసెంబ్లీసమావేశంలో పిడికిటి రామకోటయ్యకు హుకుం జారీచేశారట. "మీ పూళ్ళో విద్యార్థిఫెడరేషన్ సభ జరగనివ్వడం కాంగ్రెసుకు నామోషీ! వెళ్ళి ఆపుచేయుమని" ప్రకారం. కాశేశ్వరరావుగార్లు ఆర్డరు వేశారట. రామకోటయ్యగారు ప్రయత్నించారు కాని, గ్రామస్థులది ఒకటే సమాధానం. "బడి పిల్లలు సభ జరుపుకుంటామన్నారు మేము సాయం చేస్తామన్నాము. మధ్య మీఅటంకాలెందుకు? సభలు ఆపుచేయటమేనా మీపని?"

విద్యార్థి ప్రతినిధుల వసతులకు గ్రామస్థులు తమ యిండ్లు యిచ్చారు. వంటలు వగైరా ఏర్పాట్లలో స్త్రీలు, పురుషులు తోడ్పడ్డారు. చదువుకొంటున్న తమ బిడ్డల పండుగను జయప్రదంగా నెరవేర్చారు.

ఆటల పోటీలు

24 వ తేదీన ఆటల పోటీలతో విద్యార్థుల పండుగ ప్రారంభమయింది. చెడుగుడి పోటీలలోపిదుటీములు పాల్గొన్నాయి. బందరు దళానికి ప్రథమబహుమానం(విన్నర్సు), తాడంకికి ద్వితీయ బహుమానం (రన్నర్సు) వచ్చింది.

ఎత్తు దూకుట, బారుదూకుట, గుండువిసరుట వగైరా పోటీలు జరిగాయి. మొత్తం ఆటల పోటీలలో 76 మంది పాల్గొన్నారు. ఈ పోటీలలో నార్ల రామారావుకు ప్రథమ బహుమతులు వచ్చాయి. ఇతడు యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్పులో గెలుపొందిన బందరు విద్యార్థి.

ప్రతినిధుల సభ

25 వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రతినిధులసభ ప్రారంభమయింది. జిల్లాలో వివిధ ప్రాంతాలనుంచి 193గురుప్రతినిధులవచ్చారు. బెజవాడ కాలేజీలో పనిచేస్తున్న ప్రొఫెసరు అన్నే రాధాకృష్ణమూర్తిగారు అధ్యక్షత వహించారు. పునాదిపాడు హైస్కూలు పాత విద్యార్థిని, ఇచటజరిగే మహాసభకు అధ్యక్షుడుగా ఆహ్వానించినందుకు సంతోషం వెల్లడించారు.

తరువాత జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిపీరమాచనేనిమధుసూదనరావు విద్యార్థి వుద్యమ రిపోర్టుయిచ్చారు. జిల్లాలో యిపుడు

మా విలేఖరి

విద్యార్థిఫెడరేషనులో 3220 మంది సభ్యులున్నారు. క్రిందటియేడాది బందరులోరాష్ట్ర మహాసభను దిగ్విజయంగా జరిపారు. అన్ని హైస్కూళ్ళలోను సంఘ బ్రాంచీలున్నాయి. కిరోసిన్, నోటుపుస్తకాల సంపాదనవిషయంలో సంఘకృషిని తెలియజేశారు. ఈయేడాదిహోటలుదారులఅధికారులుచేయ్యకొనకపోవుటవల్ల విద్యార్థులకు యిబ్బందులు ఏర్పడ్డాయి. అవితొలగించడానికిగన్నవరం, గుడివాడలలో పేరెంట్సు అసోషియేషన్లు ఏర్పరచి, పాకలు వేసి ఎక్కువమంది విద్యార్థులు చదువుకునే అవకాశాలు ఏర్పరుచ బడ్డాయని తెలియజేశారు. గన్నవరం, పామర్రులలో బయటి గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులకు టిఫిన్ షెడ్డు నిర్మించడానికి జరిగిన కృషిని వర్ణించారు. ఈసంవత్సరం 'బాగా చదవాలి' అనే నినాదాన్ని అమలు జరపడానికి చేయవలసిన ప్రయత్నాలను వివరించారు. దీనిద్వారా వుద్యమం ఉపాధ్యాయులమన్ననలను పొందుతూందని ఉదహరణలుచూపారు. విద్యార్థులలో రాజకీయ చైతన్యం వృద్ధిపొందుతూంది. సిమ్లా సమావేశంపై చర్చలు విరివిగా సాగుతున్నాయి. బందరు సంఘ కార్యకర్తలు క్రిందటి పరీక్షలలో బాగా నెగ్గినందుకు, చల్లపల్లి సంఘం రోడ్డుకమిటీల వ్రాతపత్రిక దక్కగా నడుపుతున్నందుకు, బెజవాడసంఘం సభ్యత్వం ఎక్కువ చేర్పింది, విద్యార్థి పత్రికను 80 అమ్ము తున్నందుకు అభినందించారు. విద్యార్థులను మంచి ఉపన్యాసకులుగాను, రచయితలుగాను తయారుచేయుటలో ఉపాధ్యాయుల సహకారం కోరుతూ మధుసూదనరావు తన రిపోర్టును ముగించారు.

తీ ర్మా నా లు

ముట్నూరి కృష్ణారావుగారి మరణానికి సంతాపముతెలుపుతూ తీర్మానించబడింది. వీరుల మరణానికి విచారపడుతూ వారి లక్ష్యమైన స్వాతంత్ర్యం సాధించుతామని శపథం చేయబడింది. రాజకీయ ఖైదీలను విడుదల చేయాలనీ, కాంగ్రెసు సంస్థలపై నిషేధం తొలగించాలనీ కోరారు.

బందరు ప్రిన్సిపాలుగారు విద్యార్థులపై నిర్బంధచర్యలు జరిపి, వారి విద్యాభివృద్ధికి ఆటంకాలు పెట్టినందులకు నిరసన తెలుపబడింది. పామర్రు ప్రధానోపాధ్యాయునిచర్యలు విమర్శించ బడ్డాయి. సంవత్సరం మధ్యలో ఉపాధ్యాయులను ట్రాన్సఫరు చేసేపద్ధతి మానాలనీ, ఉపాధ్యాయుల జీతాలు హెచ్చించాలనీ కోరారు.

తరువాత విద్యార్థులకు సౌకర్యాలను కోరుతూ అనేక తీర్మానాలు చేయబడ్డాయి. పునాదిపాడు, గుడివాడ స్కూళ్లకు, బెజవాడ గరల్సు హైస్కూలుకు ఆటస్థలాలను ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. బెజవాడ కాలేజీలో ఫలహారశాలను ఏర్పరచాలని కోరారు.

బందరు, బెజవాడ పట్టణాలలో వసతిగృహాలు దొరకక విద్యార్థులు బాధపడుతున్నారు. వారికి వసతి సౌకర్యాలు ఏర్పరచడానికి ఖాళీగావున్న ఇండ్లను కమాండీరుచేసి యివ్వాలని కోరారు. తాడంకి హైస్కూలుకు పరీక్ష కేంద్రం యివ్వాలని కోరారు. డిటెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని తీర్మానించారు.

మధ్యాహ్నం సమావేశం పామర్రు బాలికల దేశభక్తి పాటతో ప్రారంభమయింది. సిమ్లా సమావేశం, ముఖ్య రాజకీయపార్టీలైన కాంగ్రెసులీగులమధ్యఐకమత్యంకుదరకపోవుటచే భగ్నమైనందుకు, విచారాన్ని తెలిపారు. రానున్న ఎన్నికలలో 18 యేండ్లు దాటిన వారందరికి ఓటింగు హక్కు యివ్వాలని కోరారు. గాంధీజీచే అంగీకరింపబడిన దేశాయి - లియాఖత్ సూచనలను అనుసరించి లీగ్ - కాంగ్రెసులకు సమాన ప్రాతినిధ్యంతో కేంద్రంలో సంయుక్త ప్రభుత్వం ఏర్పాటుచేయాలనీ, రాష్ట్రాలలో సంయుక్త ప్రభుత్వాలను ఏర్పరచాలనీ కోరారు. రాబోవు ఎన్నికలలో విద్యార్థులు విద్యాభివృద్ధికి దోహదంచేసే దేశభక్తులను గెలిపించడానికి కృషి చేయాలని తీర్మానించారు. ఈ రాజకీయ తీర్మానాన్ని విశదపరుస్తూ మధుసూదనరావుగారు ఉపన్యసించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు పరీక్షపత్రాలను యింగ్లీషులో యివ్వడాన్ని నిరసించారు. మాతృభాషలలోనే ప్రశ్నలు వుండాలనీ, కాలేజీలలో కూడ భాషేతర సబ్జక్టు లన్నింటినీ మాతృభాష అయిన తెలుగులోనే బోధించాలనీ కోరారు.

సాయంకాలం ఆరుగంటలకు విజ్ఞానమహాసభ ప్రారంభమయింది. వావిలాల గోపాలకృష్ణయ్యగారు ప్రారంభించుతూ గంభీరోపన్యాసమిచ్చారు. శాతవాహనులనాటి ఆంధ్రుల కళలు ఎలా వృద్ధిచెందాయో తెలిపారు. మన సంస్కృతిపై గ్రీకుల పలుకుబడియే మన దుస్తులలోని 'వల్లెవాటు' అన్నారు. క్రమంగా బౌద్ధయుగంలోను, శైవయుగంలోను మన కళలు ఎలా పరిణామం చెందాయో తెలియజేశారు. మనకు 2 వేల యేండ్ల ఆంధ్ర జాతీయ సంస్కృతి వుంది. దానిని పెంపొందించవలసినబాధ్యత భావిపౌరులైన విద్యార్థుల పైన వుందని ఉపన్యాసాన్ని ముగించారు. ప్రాచీనాంధ్ర చరిత్రను గోపాలకృష్ణయ్యగారు వర్ణించుతూంటే, విద్యార్థులు ఉప్పొంగిపోయారు.

అధ్యక్షోపన్యాసం

సభకు అధ్యక్షత వహించుతూ మద్దుకూరి చంద్రశేఖరరావుగారుఇలాచెప్పారు : ఆంధ్రులదిప్రాచీనమైన నాగరికత. ఇతర రాష్ట్రాలలో తెలుగుభాష ఎచటనైనా వినబడితే, ఎలా బిడ్డలు మాతృస్వరం విని వుప్పొంగుతారో అలాగే మనం కూడ ఆనందంతో తబ్బిబ్బవుతాము. ఆపన్నిహిత భావమే మన జాతీయసంస్కృతికి పునాది. అన్నారు. మన తెలుగు భూమిలో అనేక ప్రాంతాల ప్రజలు వెనుకబడి వున్నారు. రాయలసీమ, తెలంగానా ప్రజలకు విద్యాభివృద్ధి అవకాశాలు హెచ్చుచేయాలి. అపుడే నేడున్న ప్రాంతీయ ద్వేషాలు తెగిపోయి, ఆంధ్రజాతీయ సంస్కృతి సర్వతోముఖంగా పెంపొందుతుందన్నారు.

నేడు చదువుకొంటున్న విద్యార్థులు మరో విషయం గమనించాలి. మన ప్రజలలో నూటికి 15 మందికి మాత్రమే చదువువచ్చు. 85 మందికి చదువుకునే అవకాశం లేదు. చదువుకొంటున్న మీరు అలాంటి మన సోదరులందరికి తోడ్పడి విద్యనేర్పాలి. అప్పుడే మీ కర్తవ్యాన్ని నెరవేర్చినట్లు. బాలికలకు బాలురకంటే చదువుకునే అవకాశాలు మరీ తక్కువ. చదువుకునే బాలికలను వెక్కిరించడం, నిందలు వేయడం విద్యార్థులు మానాలి. ఇలాంటి దురలవాట్లు మానితేనే, మనం నాగరికులమనిపించుకుంటాం. తెలుగు ప్రజలందరి విద్యా, విజ్ఞానాభివృద్ధి కొరకు పాటుపడటం మన కర్తవ్యం. అపుడే మన సంస్కృతి, కళలు దినదినాభివృద్ధి గాంచుతాయి—అని ఉపన్యాసం ముగించారు.

వైజ్ఞానిక పోటీలు

భోజనానంతరం రాత్రి 10 గంటలకు విజ్ఞాన ప్రదర్శనాల పోటీ ప్రారంభమయింది. పామర్రు బాలికలు గురజాడ అప్పారావుగారి 'దేశమును ప్రేమించుమన్నా' అను గీతాన్ని శ్రావ్యంగా పాడారు. బందరు దళం 'పేదగాని నృత్యం' ప్రదర్శించారు. బెజవాడదళం సిమ్లాసమావేశం బయస్కోపు చూపుతూ పాటపాడింది. పునాదిపాడు దళం 'శకునాలు' అనే వీరేశలింగంగారి (మిగతా 9 వ పేజీలో)

రైతులకొక పర్వదినం

పెళ్ళేరుకాలువ ప్రారంభోత్సవం

★

ఆత్మకూరు తాలూకాలో పెళ్ళేరుకాలువ పూడిపోవడం, కొత్తకాలువకు ప్రభుత్వం పూనుకోకపోవడం, రైతులకు యిందువల్ల, లక్షలాది రూపాయలు నష్టమవుతూండడం, తాలూకా రైతుసంఘం యీసమస్యపై రైతులందరినీ ఏకంచేసి కొత్తకాలువను త్రవ్వకానికి పని ప్రారంభించడం - "ప్రజాశక్తి" పాఠకులకు విశదమే.

ప్రతిరోజూ-రాత్రింబవళ్ళు 500 మందికి పైగా నెలరోజులు పనిచేశారు. ఆగస్టు 25 తో పని పూర్తి అయింది ఆరోజే కాలువ ప్రారంభోత్సవం జరుగుతుందని ప్రకటించారు. ప్రభుత్వం సహాయం చేయకపోయినా, భూస్వాములు హృదయపూర్వకమైన సహకారం యివ్వకపోయినా, రైతులింతపనిని యెలా సాధించగలిగారా! అని అనేకమంది ఆశ్చర్యపోయారు నెల్లూరు జిల్లాలో రైతుసంఘ యాజమాన్యాన యిలా స్వయంకృషివల్ల పనులు చేసుకోవడం యిదే మొదలు. అందువల్ల రైతుల ఉత్సాహానికి అంతులేదు. అరేబియా ఎడారిలావున్న పెదమాళ్ళపాడు గ్రామంనుండి కొత్తకాలువ ప్రారంభ మవుతుంది. ప్రారంభోత్సవానికి అక్కడే యేర్పాట్లు చేశారు. ఏరైతును పలకరించినా, పలికే స్థితిలో లేరు! అందరూ ఏదో ఒకపనిలో నిమగ్నులై ఉన్నారు. ఎక్కడ చూచినా, హడావిడే!

గ్రామంలో ఒకవైపు భోజనసదుపాయాలు చేస్తున్నారు. మరోవైపు సభాస్థలం, నిర్మిస్తున్నారు. పిల్లలు, ముసలిరైతులు, సహితం యేర్పాట్లలో మునిగితేలుతున్నారు. మొత్తం 2000 మందికి ఆరోజున భోజనపు ఏర్పాట్లు చేయాలి. కాలువక్రింద 8 గ్రామాల రైతులు పనులన్నీ కట్టిపెట్టి 24 వ తేదీ సాయంత్రానికే పెండ్లికార్యాలకు ఆహ్వానించుకున్నట్లు ఆహ్వానించారు.

25 వ తేదీ వచ్చింది. తెల్లవారేసరికి ఏయింటిమీద చూచినా ఎర్రజండాలే. గ్రామమంతా ఎర్రజండాలతోను, తోరణాలతోను, అలంకరించారు. కాలువను తెగగొట్టడానికి ఉదయమే ఊరేగింపు బయల్దేరింది. వందలాది రైతులు చలగపారలు, ఎర్రజండాలు పుచ్చుకొని, బారులుగా కొత్తకాలువవైపు నడుస్తున్నారు. ఊరేగింపుకు జయ జయ ధ్వానాలు. రైతుగేయాలు ఎంతో శోభను తీసుకొచ్చాయి.

జిల్లా రైతుసంఘ సహాయ కార్యదర్శియైన కామ్రేడ్ జి. సి. కొండయ్య జయజయ ధ్వానాలమధ్య చలగపారతో కాలువను తెగగొట్టాడు. నీరు బిలబిలశబ్దంతో కాల్వలోకి పొర్లుతూంటే, నెలరోజులనుండి అహర్నిశలు పనిచేసిన రైతులూ, అజమాయిషీచేసిన పెద్దన వెంకట సుబ్బారెడ్డిగారూ ఆనందపరవశులయారు.

తరవాత ఒకవైపు భోజనాలు, మరొకవైపు రైతు ప్రతినిధులసభ, ఇంకొకవైపు తాలూకా రైతుసంఘ కార్యవర్గ సమావేశం జరుగుతున్నాయి. ప్రొద్దుముందా? మేముముందా? అన్నట్లు చకచక అన్నిపనులూ సాగిపోతున్నాయి.

సాయంత్రం 5 గంటలకు తిరిగి ఊరేగింపు. 5 జతల ఎడ్లతో అలంకరించబడిన ఒక బండిమీద రమ్యమైన రైతుప్రభ. దాని వెనుక ఊరేగింపు భూస్వాములు సహితం ఈసారి ఎర్రజండా చేబూని, ఊరేగింపులో నడిచారు. వీధులన్నీ జన సమూహంతో క్రిక్కిరిసిపోయాయి.

రాత్రి 9 గంటలకు మహాసభ ప్రారంభమైంది. కామ్రేడ్ కొండయ్య అధ్యక్షత వహించారు. పండ్లూరి వెంకటసుబ్బారెడ్డిగారు సభను ప్రారంభిస్తూ, ఏ ఐక్యతతో రైతులు కొత్తకాల్వను సాధించారో ఆ ఐక్యతతోనే సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ఖూడా సంపాదించగలరని ఉపన్యసించారు. రానున్న ఎన్నికలలో నిజమైన ప్రజాప్రతినిధులనే గెలిపించాలన్నారు. కామ్రేడ్ యం. శకరయ్య, యం. అంకయ్య (తాలూకా రైతుసంఘ కార్యదర్శులు) మాట్లాడుతూ, "తాలూకా చరిత్రలో కనీవినీ యెరుగని యీ బ్రహ్మాండమైన పనిని కొనసాగించిన రైతులు జిల్లాఅంతకూ మార్గదర్శకులయారు. ఈ ఐక్యతను యింకా ఉన్నత స్థాయికి తీసుకువెళ్లాలని" హెచ్చరించారు. తరువాత కామ్రేడ్ కొండయ్య ప్రపంచంలో వస్తూన్న మార్పులనుగురించి, రానున్న ఎన్నికలలో రైతులు నిసలైన ప్రజా ప్రతినిధులనే ఎన్నుకోవాలనీ, దాదాపు ఒక గంటసేపు ఉపన్యసించారు. రైతుల ఈ కృషిని ప్రశంసించడానికి బదులు వ్యతిరేకించిన ఒక భూస్వామిని గురించి చెబుతూ,

"8 గ్రామాల రైతుల శ్రమఫలితమే యీ కాలువ. ఈ కాలువ రైతుల రక్తం. స్వార్థబుద్ధితో దాన్ని పీల్చడానికి ఎవరు ప్రయత్నించినా సరే, రైతులు ఎదుర్కొంటారు."

అని ఉద్రేకపూరితంగా చెప్పారు. కాలువ త్రవ్వకు తోడ్పడ్డ రైతువర్కర్లకు, వ్యవసాయ కూలీలకు, పెదమాళ్ళపాటి గ్రామస్థులకు అభినందన లర్పించారు.

తరువాత వైజ్ఞానిక కార్యక్రమం ప్రారంభమైంది. కామ్రేడ్ రమణయ్య దళంవారు (వానిలి) "ప్రతిమ" నాటకాన్ని ప్రదర్శించారు. షేక్ ఆదెలు దళంవారు, "కష్టజీవి" బుర్రకథ చెప్పారు. 3000 మంది ప్రేక్షకులు తెల్లవారుజాము 4 గంటలవరకు కూర్చొని విన్నారు.

తమ బిడ్డలైన రైతుసంఘవర్కర్లు తమ నిత్యజీవితంలో తీసుకొస్తూన్న ఈ మార్పును చూచి, వచ్చేసంవత్సరం మా చెరువు బాగు చేయించమని కొందరు, మా కాలువ బాగు చేయించమని మరికొందరు ఆహ్వానించారు. నిజానికి ఆవేళ రైతులకొక పర్వదినమని చెప్పవచ్చు "ఈకుర్రకుంకలు యింతపని చేయగలరా?" అని అదివరకు చులకనగా మాట్లాడిన ఒకరిద్దరు వ్యక్తులు సిగ్గుతో తల వంచుకొన వలసివచ్చింది వారిప్పుడు రైతుసంఘ కృషిని ప్రశంసిస్తున్నారు.

రైతులపై, కత్తులు, తుపాకులు

★

ఖమ్మంతాలూకా గ్రామంలో పట్వారీగుండాల అత్యాచారం

ఖమ్మం తాలూకా (నైజాం) కు చెందిన పాపటపల్లి గ్రామంలో మూడు గ్రామోద్యోగాలు దాదాపు ఒకే కుటుంబానికి చెంది వున్నాయి. అంతేగాక పట్వారీ బంధువర్గానికి చెందిన పోకిరీలుతా ఈ గ్రామంలో దాదాపు 15 మంది ఉంటారు. ఏమీ తెలియని ప్రజలను బెదిరించడం, తప్పతాగి స్త్రీలను అవమాన పరచడం వారి నిత్యకార్యక్రమం. గ్రామాధికారాలుకూడా వీరికే ఉండడంవలన ప్రజలు విపరీత బాధలకు గురిఅవుతున్నారు. దీనికితోడు పట్వారీ గత సంవత్సరమూ, ఈ సంవత్సరమూ లెవీ వసూలు చేసి, ఆమొత్తానికి బదులుగా యివ్వవలసిన ధాన్యం కొంతమందికిఇంతవరకు ఇవ్వలేదు. అందుకుగాను కొంతకాలం క్రితం ఆ గ్రామ రైతులు కొందరు పై అధికారులకు, స్థానికాధికారులకు దరఖాస్తులు పంపి, తమ దుస్థితిని తెలుపుకున్నారు. రైతులందరు ఐక్యమై దాలవరకు లంచాలనివ్వటం మానుకున్నారు. అందువల్ల పట్వారీ ఆటకట్టింది.

ఈ కోపంతో పట్వారీ, మరియు అతని అనుచరులూ కలిసి తుపాకులు, కత్తులు, లాఠీలు మొదలగుఆయుధాలతో కావలాకాచి, రైతులపై విరుచుకపడ్డారు. రైతులను కత్తులతోను లాఠీలతోను గాయపరచారు. ఒక పెద్ద రైతును గురిచూచి తుపాకి పేల్చుచుండగా, వెనుకనుండి అడ్డుకొనుటవల్ల గురి తప్పి పేలింది. నలుగురైదుగురు రైతులకు విపరీత గాయము లేర్పడినవి. ఈ విషయము గ్రామరైతులందరికి తెలిసి వరుగెత్తుకొని వచ్చుసరికి, పట్వారీముఠాతమకార్యక్రమాన్ని కట్టిపెట్టింది. రైతులు శాంతియుతంగా గాయాలు తగిలినవారిని తీసుకొని వెళ్లారు. తదనంతరం దాదాపు 200 మంది రైతులు ఖమ్మంవచ్చి జిల్లా పోలీసు అధికారివద్ద మొరపెట్టుకొనగా, వెంటనేమొహతామీంగారు (జిల్లా పోలీసు అధికారి) సిబ్బందిని పంపి పట్వారీని, మరికొంతమంది గూండాలను, ఆయుధాలతో అరెస్టుచేయించి పోలీసు స్టేషనులో బంధించారు.

బంటుమిల్లి పోలీసుల లంచగొండితనం

21-7-45 వ తేదీని బందరు తాలూకా పెందుర్రు గ్రామ కాపురస్థులు 99 మంది కలిసి కృష్ణాజిల్లా కలెక్టరుగారికి యీ క్రింది మహజరు పంపుకున్నారు :

"అయ్యా,! బందరు తాలూకాలో బంటుమిల్లి ఫిర్కా ఆర్థికంగా చాల వెనుకబడియున్నది. ప్రతిరోజూ పనిచేసుకుంటేనేగాని ప్రజలు తమ పొట్ట తాము పోషించుకునే స్థితిలోలేరు, చదువు చాల తక్కువ. ఇటువంటి పరిస్థితులలో బంటుమిల్లి పోలీసు స్టేషనులోని పోలీసులు అమాయకమైన మామీద ప్రతిదినము చేయు దౌర్జన్యం మితిమీరిపోతూంది. వారు అడిగినపుడల్లా లంచాలు యివ్వకపోతే అక్రమ కేసులు బనాయించడం, తిట్టటం, నానా అంగామా చేయడం, పరిపాటి అయిపోతూంది. మేము కిరాయికి వ్యవసాయపు పనులమీద బంటుమిల్లికి బండ్లు తోలుకొని వెళ్ళునపుడు అక్రమముగా రు. 1-0-0 లేక 2-0-0 యివ్వలేదనే కారణంచేత అరెస్టు చేశామని, జైలుకు పంపుతామని, భయపెట్టి పేదవారమయిన మావద్ద రు. 1 మొదలు 5 వరకు లంచాలు తీసికొని వదలిపెట్టుట. ఆ విధంగా లంచాలివ్వని వారిమీద కేసులు పెట్టి జరిమానాలు చేయించుట, జరుగుచున్నది. వారికి డబ్బు కావలసినపుడల్లా అనవసరంగా స్టేషనుకు పిలిపించి, భయపెట్టి డబ్బుగుంజుతున్నారు. ఈ బాధతో మాకు ప్రతినిత్యము అత్యవసరమయిన పనులువుండి బంటుమిల్లి వెళ్ళవలసియువెళ్లలేక భయపడికొన్నిపనులు కూడా నష్టపడుచున్నాము.

మేము పేదవార మగుటవల్ల జీవనోపాధికి కూరగాయలు వగైరాలు బంటుమిల్లికి తీసుకెళ్ళి వ్యాపారం చేసుకుంటాం. మావద్ద ప్రతి తట్ట కూరగాయలకు పావలా, అర్ధ చొప్పున దరాయించి, లంచాలు వసూలుచేయడం అలవాటు అయిపోయింది. ముఖ్యముగా స్టేషను రైటరు, నెం. 231 కానిస్టేబులు, నెం. 446 735, 324 కానిస్టేబుల్సు చేసే దురంతాలు ఎక్కువ అగుచున్నవి. తామందులవారు దయవుంచి పైవారిమీద తగిన చర్యతీసుకొన వలసినదిగా కోరుచున్నాము"

ఈ మహజరు 21-7-45 వ తేదీని పంపబడినా, ఇంతవరకు జిల్లా అధికారులు విచారణ ప్రారంభించకపోవడం శోచనీయం. త్వరలో విచారణచేసి, తమ కావేదార్లను అదుపు ఆజ్ఞలలో ఉంచమని కోరుతున్నాం.

*

బంటుమిల్లిలోనే జిల్లాబోర్డు హైయర్ ఎలిమెంటరీస్కూలు ఒకటివుంది. సుమారు 25 వేల జనాభాగల 30 గ్రామాల విద్యాభివృద్ధికి ఒకే ఒక హైయర్ ఎలిమెంటరీ స్కూలు! అందులో ఉపాధ్యాయులు ఉండవలసిన 8 మందికి 4గురు మాత్రమే ఉన్నారు. హెడ్మాష్టరుగారు స్కూలుకు రెగ్యులర్‌గాహాజరుకారు. ఇకబోర్డు డిస్పెన్సరీలో డాక్టరు రోగులకు సక్రమంగా చికిత్సచేయక, డబ్బు యివ్వకపోతే, చూడ నిరాకరిస్తున్నారు. అసుపత్రిని తన యిష్టం వచ్చినపుడు తెరుస్తాడు. ఈ విషయములను గురించి గ్రామస్థులు జిల్లాబోర్డు అధికారులకు తెలియజేశారు. నెమ్మదిగా చైతన్యం పొందుతూ, ఈఅక్రమాల నెదుర్కొడానికి ప్రయత్నిస్తూన్న పెందుర్రురైతులపట్ల పోలీసులకు, యీ హెడ్మాష్టరుగారికీ, డాక్టరుగారికి తగని మంటగాఉంది. వెంటనే ప్రభుత్వం. బోర్డు అధికారులు యీ అక్రమాలను అరికట్టడం అవసరం.

వ్యవసాయాభివృద్ధికి రైతుసంఘాల సూచనలు

11-8-45 వ తేదీని ఆత్మకూరుతాలూకా (నెల్లూరుజిల్లా) రైతుసంఘ వార్షిక సమావేశం శ్రీ వంగ్లూరి వెంకట మధ్వారెడ్డిగారి అధ్యక్షతక్రింద నాఘారు గ్రామంలో జరిగింది. ప్రభుత్వం వత్వరమే గండికోట ప్రాజెక్టుకు పని ప్రారంభించవలెననీ; ఇనుము, వ్యవసాయ పనిముట్లు కంట్రోలు ధరలకు విరివిగా సప్లయి చేయించవలెననీ; మెట్టధాన్యాలకు న్యాయమైన ధరలు నిర్ణయించమనీ; కంట్రోలు సలహా కమిటీలలో ప్రజాసంస్థలకు ప్రాతినిధ్యం ఇవ్వమనీ; నేతబట్టలకు ధరల కంట్రోలు అమలు జరపమనీ - కోరుతూ తీర్మానాలు ఆమోదింపబడ్డాయి.

★

12-8-45 వ తేదీని నెల్లూరు తాలూకా రైతుసంఘ తృతీయ వార్షిక సమావేశం వేణుంబాక వీరరాఘవరెడ్డిగారి అధ్యక్షత క్రింద నెల్లూరులో జరిగింది. క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

— వ్యవసాయ పనిముట్ల విషయంలో ఆహారకమిటీవారు, రైతుసంఘాలు, సిఫార్సు చేసిన జాబితా ప్రకారం వాటిని ప్రభుత్వం తెప్పించాలి. పంపకము విషయంలో కూడా స్థానిక రైతుసంఘాల సూచనలను గౌరవించాలి. తాలూకా అంతటా రైతుల కందుబాటులో ఉండేటట్లు సైపారు, ముత్తుకూరు, వెంకటాచలపత్రము లలో డిపోలు పెట్టి, అక్కడ పనిముట్లు - ఎరువులు - విత్తనాలు అమ్మించాలి.

— పెన్నారునదికి వచ్చే నీటిలో 100 కి 20 భాగాలు మాత్రమే నేడు ఉపయోగపడుచున్నదిగాన, నదిమీద బ్రిడ్జి కట్టించి, తూములు ఏర్పరచి, నీటిని నిల్వచేయాలి. ఇందువల్ల చాలాభూమిని సాగులోనికి తీసుకురావచ్చు. ఈలోగా, తాత్కాలికంగా, ఇప్పుడున్న వద్దర్పును తీసివేసి 6 అడుగుల ఎత్తు గలవానిని నిర్మించాలి. అన్ని కాల్వలను వెడల్పుగాను, లోతుగాను, తవ్వించాలి.

— సర్వేపల్లి రిజర్వాయరు క్రింది ఆయకట్టు 19,000 యకరాలనుండి 20,000 యకరాలకు పెరిగినందున రిజర్వాయరు కట్టను 2 అడుగులు పెంచి, అందుకు తగినట్లు నీటి లెవెల్‌ను కూడా హెచ్చుచేయాలి.

ప్రస్తుతం హెడ్‌స్లూయిస్ క్రింద పారుదల అగుచున్న గ్రామములకు రిజర్వాయరు వద్ద, నెం. 2, 3 తూములకు మధ్యగా, మరొక తూమును కట్టించి సింగారెడ్డి డ్రెయిన్ వెంబడే ప్రత్యేకమైన కాలువ త్రవ్వించాలి. ఇందువల్ల నీటి కొరత పోవుటయేగాకుండా, అదనంగా 1000 యకరాలు సాగులోనికి తీసుకురావచ్చు.

— మొలకలపూడి, తిరుమలమ్మపాలెం, మాదిగవాడ, అమ్మగారిపాలెం, వెంకమ్మపాలెం, ఎగువ మాల వాడ, గ్రామాలలో మంచినీటి వసతి లేనందున యీగ్రామాల్లో ప్రభుత్వం బావులు తవ్వించాలి.

★

తిరువూరు తాలూకా రైతుసంఘ యాజమాన్యాన విస్సన్నపేట, కొండపర్వ, కూనవరాజపర్వ, మాధవరం, తిరువూరు గ్రామాల్లో క్రిందటివెల 3 వ వారంలో బహిరంగసభలు జరుపబడ్డాయి. గత సంవత్సరం ఎన్నిమేలైన సుమారు 120 చెరువులకు ప్రభుత్వం మరమ్మతు చేయించి, జమీందార్లనుండి ఖర్చులు వసూలుచేయవలెననీ; తాలూకా యందలి 18 చెరువుల లోదట్లలో వర్జీనియా పొగాకు వేయుటవల్ల రైతాంగమునకు ఆహారవంటలు నష్టమవుతున్నాయిగనుక, ప్రభుత్వం దీన్ని ఆపుచేయించాలనీ; వ్యవసాయశాఖవారు రైతులకు సకాలంలో ఎరువులు, వ్యవసాయ పనిముట్లు విరివిగాసప్లయిచేయాలనీ; నీటి అక్షును రద్దుచేయాలనీ - కోరుతూ తీర్మానించారు.

స్కూలుఫైనలు విద్యార్థుల కష్టాలు

నేటికి గూడ ఆంధ్ర దేశమునకు ప్రత్యేక స్కూలుఫైనలు బోర్డులేదు. మద్రాసు, ఆంధ్ర విశ్వవిద్యాలయముల క్రింద ప్రత్యేక వాల్యుయేషన్ బోర్డును మాత్రము ఏర్పరచారు. దీని నవకాశంగా తీసుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయాధికారులు ఆంధ్రవిద్యార్థుల విద్యాభివృద్ధికి అడ్డుతగులుచున్నారు. 1944-45 వ సంవత్సరం స్కూలుఫైనలు పరీక్ష ఫలితాలలో మద్రాసు విశ్వవిద్యాలయం క్రిందనున్న స్కూళ్ళలోనూటికి దాదాపుగా 60 కి పైబడి ఉత్తీర్ణులయారు. మరి ఆంధ్ర విశ్వ విద్యాలయం? నూటికి 42 మించలా! ఈ వైఖరిని ఖండించుచూ ఆంధ్ర విశ్వవిద్యాలయం గూడ మద్రాసు విశ్వవిద్యాలయమువలె నూటికి 60 మందిని ఉత్తీర్ణుల జేయవలయునని విద్యార్థులు, ప్రజలు, పత్రికలు ఘోషించాయి. దాని ఫలితం-మొన్నమొన్ననే మరియొక లిస్టును ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించింది. ఈ లిస్టులో రాష్ట్రంమొత్తమునకు 42 మందిని ఉత్తీర్ణులను చేసినారు. ఇది ఎవరినీ సంతృప్తి పర్చలేదు.

ఈ సప్లిమెంటరీ లిస్టును ప్రకటించుటలో వీలయినంత హెచ్చుమందిని తప్పించవలయుననెడిసూత్రమే అమలు జరుపబడినది. గూర్పు సబ్జక్టులో మాత్రం ఒక్కమార్కు తక్కువవచ్చినవారినే యీసప్లిమెంటరీలిస్టులో ప్యాసుచేసినట్లు-యితర సబ్జెక్టులలో మార్కు తక్కువ వచ్చినవారిని గూడ ప్యాసుచేయుటకు నిరాకరించినట్లు తెలియుచున్నది.

పరీక్ష విధానంలో అవలంబింపబడుచున్న కృత్రిమ పద్ధతులకు తోడుగా, యీ సంవత్సరం యింగ్లీషు - తెలుగు పాఠ్యపుస్తకములు నెల నుండి 1½ నెలవరకు ఆలస్యంగా అందజేయబడినవి. దీనికి బాధ్యులు విశ్వవిద్యాలయం, స్కూలు ఫైనల్‌బోర్డు, అధికారులు. పాఠ్యపుస్తకములు అందజేయుటలో జరిగిన యీ ఆలస్యమునకు తగినట్లుగా కొంత సిలబసును తగ్గించవలసినది. అపని యింతవరకూ జరుగలేదు. ఉపాధ్యాయులు తమ సయమిత కాలంలో సిలబసును పూర్తిజేయవలయును గనుక, విద్యార్థులు అర్థంజేసుకొనుచున్నారా? లేదా అను విషయం ఆలోచించుటకు తావు లేదు. దీని ఫలితంగా విద్యార్థులు నష్టపడవలసివచ్చుచున్నది. ఈ విషయంలో ఉపాధ్యాయు లనేకమంది పత్రికాముఖమున సిలబసును తగ్గించవలసిన అవశ్యకతను వెల్లడించారు. కాని ఈవిషయంపై విశ్వవిద్యాలయాధికారులు ఒక్క ప్రకటనగూడ చేయలేదు. ఈ నిర్లక్ష్యత విద్యార్థుల జీవితములతో చెలగాటమాడుటగాక మరి యేమి?

దీనికి తోడుగా యీ సంవత్సరమునుండి పరీక్ష పత్రము లన్నియు యింగ్లీషులోనే యీయబడునని తెలియుచున్నది. ఇంతవరకు 4, 5 సంవత్సరముల నుండి స్కూలుఫైనలు క్లాసుకు యింగ్లీషు తప్ప అన్ని సబ్జక్టులను తెలుగులోనే జవాబులు వ్రాయుట, తెలుగులోనే పత్రము లిచ్చుట జరుగుచున్నది.

ఇంగ్లీషు భాషానైపుణ్యం విద్యార్థులలో క్షీణించునని, దాని అభివృద్ధికి ప్రశ్నాపత్రములు యింగ్లీషులో యిచ్చి తోడ్పడుదురని తెలియు చున్నది. ఇది ఏమాత్రం సరియైన మార్గంగాదు. ఇంగ్లీషు భాషాభివృద్ధికి తోడ్పడుటకు బోధనాపద్ధతులలోనున్న లోపములను కనుగొని సవరించవలయునేగాని, ప్రశ్నాపత్రము యింగ్లీషులో యిచ్చినంత మాత్రమున ఫలితం శూన్యం. దీని ఫలితంగా తెలుగులో చదువుకొనియున్న విద్యార్థులు ప్రశ్నా పత్రములలోని శాస్త్రపారిభాషిక పదములను అర్థం చేసుకొనలేక నానా ఇబ్బందులకు లోనుగావలసి యున్నది.

స్కూలుఫైనలు బోర్డు విద్యార్థుల యిబ్బందులను గమనించి వెంటనే పైసమస్యలను పరిష్కరించుచూ ప్రకటన జేయవలయును. పై కోర్కెలు సఫలమైనదాకా విద్యార్థులు - తల్లిదండ్రుల సహకారంతో నిరంతరాందోళన సాగించవలయును.

యస్. వి. నరసయ్య.

కార్యదర్శి

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశం

సెప్టెంబరు 18, 19

కామ్రేడ్స్,

మార్చి నెలలో జరిగిన సమావేశం తరువాత రాష్ట్రరైతుసంఘ సాధారణ సభ్యుల సమావేశం తిరిగి సెప్టెంబరు 18, 19 తేదీలలో బెజవాడలో, సంఘ కార్యాలయమందు జరుగబోతూంది. యుద్ధం అంతమొందింది, ఈనాడు మనలను అనేక కొత్తసమస్యలు ఎదుర్కొంటున్నాయి. రైతులు పండించే ధాన్యాల ధరలు, ఎస్టేటు లాండు ఆక్టు సవరణ, యుద్ధకారణంగా ఆపివేయబడిన డ్రైనేజి స్కీములు, ప్రాజెక్టుల నిర్మాణం మొదలగు అనేక ముఖ్యసమస్యలపై నిర్ణయాలు తీసుకోవలసియున్నది. అందుచేత ఈ సమావేశానికి అన్ని జిల్లాలనుండి అందరు సభ్యులు హాజరు కాగోరు చున్నాను. రాష్ట్ర కార్యవర్గ సమావేశం సెప్టెంబరు 17 ఉదయం ప్రారంభమవుతుంది.

ఇట్లు,

నండూరి ప్రసాదరావు

ప్రధానకార్యదర్శి

గమనిక:—కొన్ని జిల్లాలకు పంపబడిన నోటీసులలో సమావేశం 17 వ తారీఖున అని పడింది. అది పొరపాటు.

నిమ్నజాతుల సాగుబడి భూముల మంజూరు చేయాలి

నెల్లూరుజిల్లా నిమ్నజాతుల ఫెడరేషన్ తీర్మానాలు

18-8-45 వ తేదీని నెల్లూరుజిల్లా నిమ్నజాతుల ఫెడరేషన్ యొక్క కార్యవర్గం నెల్లూరులో సమావేశమై, యీక్రింది తీర్మానములు గావించినది:

— భారతదేశ సైన్యంలో ఎక్కువగాచేరి మిత్రమండలి విజయానికి తోడ్పడిన నిమ్నజాతుల వారిని అభినందించారు. వారి సేవను ఇండియా ప్రభుత్వం గుర్తించి రికార్డుచెయ్యాలన్నారు.

— అధికాహారోత్పత్తి స్కీము క్రింద నిమ్నజాతుల వారికిచ్చిన సాగుబడి భూములను తిరిగి ప్రభుత్వమువారు తీసుకోకుండా, సదరు భూముల పట్టాలను మంజూరు చేయవలసిందని మద్రాసు ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

— నెల్లూరుజిల్లాకు కేంద్రమైన నెల్లూరు టవున్‌లో చదువుకొనే నిమ్నజాతి విద్యార్థుల హాస్టల్‌కు లేబరు డిపార్టుమెంటువారు ఒకే మొత్తంగా గ్రాంటు యివ్వవలసిందనికోరుతూ తీర్మానించారు.

— ఫెడరేషన్ నాయకులైన డాక్టర్ అంబేద్కరుగారిని నిందించుచు బి. ఎస్. మూర్తి, వేముల కూర్మయ్య వగైరాలు గావించే వ్యతిరేక ప్రచారాన్ని ఖండిస్తూతీర్మానించారు.

— కావలిలో అగ్రజాతులవారు ఆది ఆంధ్రుల దండనము, కొన్ని వస్తువులను అక్రమంగా అపహరించుట, మొదలగు చర్యలు చేయుచున్నారు. అట్టివారి దోరయని కమిటీవారు ఖండించారు. జిల్లా కలెక్టరు స్వయంగా యీ విషయమై దర్యాప్తు చేయవలసిందని కోరారు.

— ఏలూరుతాలూకా కొవ్వలి గ్రామంలో ఆదిఆంధ్రులపై జరిగే అక్రమ చర్యలను గూర్చి మదరాసు ప్రభుత్వం వెంటనేదర్యాప్తు చేయవలసిందని కోరుతూ తీర్మానించారు.

కరువుభత్యంలో కోతకు ప్రభుత్వ ప్రయత్నం

●

జులైలో కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిన సర్క్యులర్‌లో కార్మికుల కిస్తున్న కరువుభత్యం విషయమై ఈ క్రింది విధంగా ఉన్నది:

"యుద్ధం అంతమయిందికాబట్టి క్రమంగా ధరలు తగ్గిపోవచ్చు. కరువుభత్యాన్ని తగ్గించే సమస్య ప్రాధాన్యత వహిస్తున్నది. పారిశ్రామిక భద్రతను కాపాడుటకు యిది చాలా ముఖ్యం. యజమానులు కరువు భత్యాన్ని తగ్గించటంలో యీక్రింది సూత్రాలను ఆమోదించునట్లు చూడాలి.

1. యజమానులు ప్రస్తుతం స్వల్ప జీతాలవారి కరువుభత్యాలను తగ్గించగూడదు. పెద్దజీతాలవారివి తగ్గించవచ్చు. జీవిత ప్రమాణంలో తగ్గుదలనుబట్టితగ్గించుకుంటూరావాలి.

2. స్వల్పజీతాల వారికిచ్చు కరువు భత్యం ప్రభుత్వపు స్కీముక్రింద స్వల్పజీతాలవారి కివ్వబడిన కనీస కరువుభత్యం కంటె హెచ్చుగా వుంటే, యజమానులు ప్రభుత్వపు రేటుతో సరిసమానంగా దానిని తగ్గించాలి. యజమానులు జీతాలను పెంచిన సందర్భంలో జీతాలలోని పెంపుననుసరించి ప్రభుత్వయొక్క కనీసపుకరువు భత్యపు రేటుకంటేకూడా తగ్గించవచ్చును.

3. కరువుభత్యంతో పాటుగా యజమానులు చవుకడిపోలను పెట్టి వస్తువులను చవుకరేట్లకు సప్లయిచేయిస్తున్న ప్రదేశాలలో స్థానికంగా రేషనింగు వున్నట్లయితే, కరువుభత్యాన్ని తగ్గించేముందు చవుకడిపోలను రద్దుచేయాలి."

కార్మికుల ఆందోళన

"పారిశ్రామిక భద్రత"ను కాపాడడానికి గాను కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల కంపిన సర్క్యులర్ యిది. ఈ సర్క్యులరునుబట్టి తేలుతున్న విషయం ఒక్కటే. కార్మికుల కరువుభత్యాన్ని తగ్గించడాన్ని ప్రభుత్వమే ప్రోత్సహిస్తున్నది. సర్క్యులర్‌లోని సూచనలను వుపయోగించుకొని యజమానులు యుద్ధం అయిపోయింది, ధరలు తగ్గిపోతున్నాయనే సాకుపెట్టి కరువుభత్యమును తగ్గించుటకు ప్రభుత్వం పూర్తి అవకాశములను కల్పిస్తున్నది.

ప్రతి పరిశ్రమలోను యజమానులు ప్రస్తుతం కార్మికులకు యిస్తున్న కరువుభత్యాలు అతిస్వల్పం. ప్రభుత్వపు లెక్కలప్రకారమే ధరల పెరుగుదల దాదాపు 270 పాయింట్ల వరకు పెరిగివున్న ప్రస్తుత పరిస్థితుల్లోకూడా, కరువుభత్యం సగటున నూటికి 20 వంతుల కంటె దాటలేదు. ధరల పెరుగుదల ఫలితంగా కార్మికుడు యెదుర్కొనవలసివచ్చిన ఆర్థిక దుస్థితిని ఏమాత్రం తొలగించలేకపోయింది కరువుభత్యం.

ఈ స్వల్పప్రాతి కరువుభత్యాలను పొందటానికైనా వివిధ పరిశ్రమలలోని కార్మికులు యజమానులమీద, ప్రభుత్వంమీద యెంతో ఒత్తిడి తీసుకురావలసివచ్చింది. రైల్వే, జూట్, గుడ్డలమిల్లు పరిశ్రమలలో అక్కడక్కడ కార్మికులు యుద్ధకృషినే ప్రధానంగా పెట్టుకొని పనిచేస్తున్నప్పటికికూడా ప్రభుత్వము, యజమానులయొక్క సంకుచిత విధానం ఫలితంగా సమ్మెలకు సహితం దిగవలసివచ్చింది. దేశమంతటా కార్మికవర్గంలో వ్యాపించిపోతున్న యీ అసంతృప్తిని కనిపెట్టి కేంద్రప్రభుత్వం గ్రిగరీ కమిటీని నియమించి కరువుభత్యం విషయంలో అదిచేసిన సూచనలపై ఒక పద్ధతిని నిర్ణయించింది.

ప్రస్తుత పరిస్థితులు

ప్రభుత్వ విధానంప్రకారం 25 రూపాయిల వరకు జీతాలు కలవారికి ధరల పెరుగుదలకు తగినట్టుగా జీతాన్ని మించకుండా కరువుభత్యమివ్వాలి. 26 నుంచి 60 వరకు జీతాలు కలవారికి మొదటి తరగతిలోనివారికిచ్చే కరువుభత్యంలో నూటికి 70 వంతుల కరువుభత్యమివ్వాలి. ఈ విధానం ప్రకారంకూడా కరువుభత్యం ధరల పెరుగుదలలతో సరిసమానంగా మన్నదనలేము. కార్మికులయొక్క స్వల్ప జీతాలతో కరువుభత్యాన్ని ముడివేయటం జరిగింది. జీతాలను మించి ఉండకూడదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన యీ విధానం లోటు బొట్లతో కూడుకొన్నప్పటికి, యజమానులు యీ విధానాన్ని సహితం అమలుజరుపలేదు. వస్తువుల ధరలు 270 పాయింట్లవరకు పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లోకూడా యెంత జీతమో అంత కరువుభత్యం ముట్టటంలేదు. సగటున 4 లేక 8 రూపాయిలమధ్యనే ప్రస్తుతం యిచ్చిన కరువుభత్యం విలువ యున్నది. యజమానులు యిచ్చిన కరువు భత్యం యింత హీనంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం యజమానులపై ఒత్తిడి తీసుకొనివచ్చి తాను నిర్ణయించిన విధానం ప్రకారం కరువు భత్యాలను యిప్పించలేకపోయింది.

యజమానులు కరువుభత్యాన్ని తగినంతగా పెంచకపోయినా, జీతాలను పెంచారా అనుకుంటె, వారు దానిమాట అసలే యెత్తుకోనేలేదు. ఏకాస్తగానో జీతాలను హెచ్చించినచోట, కరువుభత్యానికి అసలే సున్నాపెట్టారు. యుద్ధానికి పూర్వం ఎంత జీతాలున్నాయో, యిప్పుడుకూడా అస్వల్పజీతాలే. జీతాల పెరుగుదలనుబట్టి కరువుభత్యమును పెంచక, పూర్వపు స్వల్పజీతాలలోనే కార్మికులను అట్టిపెట్టటమంటె, పరోక్షంగా జీతాలలో కోతకోయడమన్న మాట.

ఇంతవరకు కార్మికులకిస్తున్న జీతాలు, కరువుభత్యాలు అతిస్వల్పం అనుకుంటుంటె, ధరలు తగ్గిపోయే పరిస్థితులు కలుగుతున్నాయని చెప్పి, కరువుభత్యాలను తగ్గించ పూనుకోటం కార్మికులను మరింత ఆర్థిక దుస్థితికి గురిచేయటమవుతుంది. కరువుభత్యాలను తగ్గించమనటమే కాకుండా, రేషనింగువున్న ప్రదేశాలలో యజమానులు కార్మికుల కొరకు తెరిచిన చవుక డిపోలను యెత్తివేయాలన్నారు. ప్రభుత్వ రేషనింగు ముఖ్యంగా ఒక బియ్యానికే. ప్రభుత్వ డిపోలలో మిగతా అవసరవస్తువులు దొరకవు. ప్రయివేటు అంగళ్ళలో కొనాలంటె, హెచ్చురరలకు కొనవలసి వుంటుంది. చవుకడిపోలను రద్దు చేస్తే రైల్వే కార్మికులు యెక్కువగా నష్టపడతారు. జీతాలు స్వల్పం: కరువుభత్యాలు స్వల్పంఅ యినప్పటికి రైల్వే కార్మికులను ప్రభుత్వం మిలిటరీ యూనిట్లలో చేర్చటం ఫలితంగా అదనంగా మిలిటరీ జీతాలు ఇవ్వబడుతున్నాయి. కాని మిలిటరీ యూనిట్లు డిసెంబరు ఒకటితోటి రద్దుచేయబడతయి. ఈ పరిస్థితులలో రైల్వే యజమాన్లు కార్మికులకు ప్రత్యేకంగా స్థాపించిన చవుకడిపోలను స్టోరువాన్లను రద్దుచేసినట్లయితే, 8 లక్షల రైల్వే కార్మికులలో కల్లోల మేర్పడుతుంది. కార్మికులకొరకు ప్రత్యేకంగా స్థాపించబడిన అంగళ్ళను యెత్తివేయటంవల్ల కార్మికులు దొంగవ్యాపారస్తులచే పీల్చి పిప్పి చేయబడుతారు.

యుద్ధం ఆగిపోయినప్పటికి, కొంతకాలం వరకు ధరలు తగ్గే సూచనలేమీ కనపడటం లేదు. కాబట్టి కరువుభత్యాన్ని తగ్గించవసరంలేదు. చవుక డిపోలను రద్దుచేయ నవసరంలేదు. ప్రస్తుతం యిస్తున్న కరువుభత్యాలను, చవుకడిపోల సహాయాన్ని,యేమాత్రం రద్దుచేయకుండా ప్రభుత్వం చూడాలి. కార్మికులు కరువుభత్యంతోపాటుగా ప్రస్తుతమున్న స్వల్పజీతాలను హెచ్చుచేయమని, కనీస జీతమును నిర్ణయించమని ఆందోళన చేస్తున్నారు. కరువుభత్యాలను జీతాలతో కలిపివేసి తద్వారా జీతాలను హెచ్చుచేయునట్లుగా ప్రభుత్వం చూడవలసి ఉన్నది. అతిస్వల్ప జీతాలతోవుంచి, కరువుభత్యాలను, చవుకడిపోలను తీసివేసినట్లయితే, కార్మికవర్గంయొక్క కొనుగోలుశక్తి పూర్తిగా పడిపోతుంది. కోట్లకొలది కార్మికుల కొనుగోలుశక్తిని నిర్మూలించి ప్రభుత్వం "పారిశ్రామిక భద్రత"ను ఏమిస్థాపించగలదు? జీవిత భృతిని నిర్ణయించేంత వరకు కరువుభత్యాలను యజమానులు తగ్గించకుండా ఉండేలా ప్రభుత్వం చూడాలి.

— పోలేపెద్ది నరసింహమూర్తి

2 లక్షలమంది రైల్వేకార్మికుల నోటిలో మన్ను కొట్టరాదు

●

"ఈ సమయంలో ప్రభుత్వాధికారాన్ని స్వీకరించే దెవరైనప్పటికి అనేక చిక్కు సమస్యలను ఎదుర్కొనక తీరదు. ఉదాహరణకు 2 లక్షల టెంపరరీ రైల్వే కార్మికుల సమస్యవున్నది. సైనికుని కృషి ఎంత ప్రధానమో, వీరి కృషి అంత అత్యవసరం. కాని, వీరు ప్రస్తుత నిరంకుశ ప్రభుత్వం చేతుల్లో నిరుద్యోగానికి గురి కానున్నారు. జీవనాధారం కొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే హక్కు వీరికి పూర్తిగా వున్నది."

యం. యస్. యం. రైల్వే ఎంప్లాయీస్ యూనియన్, పెరంబూర్ బ్రాంచీయొక్క 18 వ వార్షిక మహాసభలో వుపన్యసిస్తూ రాజాజీ అన్నమాటలివి.

యుద్ధం అయిపోగానే సైన్యంలోనుంచి యిళ్ళకు తిరిగివచ్చు సైనికులకు ప్రభుత్వం పనులు కల్పించదలచుకుంది. రైల్వేలలో 1-6-42 నుంచి పనుల్లోను చేరిన 2 లక్షల కార్మికులను ఇందుకోసం తొలగించ బూనుకుంటుంది. వీరందరూ టెంపరరీ పని వారే అని సాకుచెప్పి. ఈ ప్రమాదానికి ఒడికట్టనుంది. ప్రస్తుత ప్రభుత్వంయొక్క యుద్ధానంతర పునర్నిర్మాణ స్కీములు ఎంత వ్యయంగా ఉంటాయో పైనిర్ణయంవల్లనే తెలుసుకోవచ్చు.

మరోవిషయం: 270 పాయింట్లకు జీవిత పరిమాణము హెచ్చినప్పటికీ, తమచేత నియమింపబడిన రావుకమిటీయే ప్రతి పాయింట్లు పెరుగుదలకు రు. 1-8-0 చొప్పున కరువుభత్యమును పెంచాలని సూచించినా కూడా, అఖిలభారత రైల్వేమెన్ ఫెడరేషన్ కోరుతున్న 45 రూపాయిల కరువుభత్యాన్ని నిరాకరిస్తున్నదీ ప్రభుత్వం. ప్రస్తుతపు స్వల్పజీతాల పద్ధతిని రద్దుచేసి, కొంచెం హెచ్చుగా వుండే పాత జీతాల స్కేళ్ళను తాత్కాలికంగా ప్రవేశపెట్టి, కనీసవేతనం 36 రూపాయలని నిర్ణయించాలంటే: యుద్ధానంతరం వరకు జీతాలమాటే యెత్తుకోమన్నది. ఈ విధంగా రైల్వే కార్మికుల న్యాయమైన కోర్కెలను నిరాకరిస్తూ, వారి నెదుర్కొంటున్న ఆర్థిక బాధలను తొలగించటానికి పూనుకోకుండా, తియ్యని కబుర్లతోటి ప్రభుత్వం వారిని బుజ్జగించ చూస్తున్నది. రైల్వే సభ్యుడు బెంథాలూ, పైప్రాయి వేసెలూ, "యీ యుద్ధసమయంలో రైల్వేకార్మికుల కృషి ప్రశంసాపాత్ర"మని పొగుడుతున్నారు. "ఈ కపటస్తోత్ర పాఠాలకు రైల్వేకార్మికులు మోసపోయేవారు కారు. ఐక్యతా బలం ద్వారా వారికోర్కెలను సంపాదించుకోవడమే వారియొక్క ప్రధానకర్తవ్యం" అని చాటాయి, ఆంధ్రలో వివిధ కేంద్రాలలో మొన్న జరిగిన బ్రాంచి వార్షికమహాసభలు.

సంఘాభివృద్ధి

ఈ మహాసభలు ఆమోదించిన రిపోర్టుల ప్రకారం రాజమండ్రి బ్రాంచిలో 1350, బెజవాడలో 2150, బిట్రగుంటలో 1460, పాకాలలో 1125, గుంటకల్లులో 2800, ధనుకొండలో 1200 యూనియన్ సభ్యులున్నారు. ఇది సగటున నూటికి 60 వంతున సభ్యత్వం. సెక్షనల్, డిపార్టుమెంటల్ కమిటీలు గుంటకల్లులో 17, బెజవాడలో 13, బిట్రగుంటలో 4, పాకాలలో 3, రాజమండ్రిలో 4, ధనుకొండలో 6 వున్నాయి. రైవండిసన్ల ఇబ్బందుల గురించి, జరిగిన ఆందోళనతోపాటు, కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలని, కాంగ్రెస్ లీగులు ఐక్యమవ్వాలని, జాతీయ ప్రభుత్వం ఏర్పడాలని ఉద్రేకంతో ఆందోళన చేశాయి. బ్రాంచీలన్నీ నిర్మాణాత్మక కార్యక్రమాన్ని ననుసరించి కార్మికులను సమీకరిస్తూ, పురోభివృద్ధి పొందుతున్నాయి. మొన్నటి విషయ (మిగతా 8 వ పేజీలో)

కొత్త రైలుమార్గాలను నిర్మించాలి

(7వ పేజీ తరువాయి) నిర్ణయ సభల్లో విరసి రాష్ట్రాలైన గ్యాంగు వర్కర్లు ప్రతినిధులు మొదలుకొని, విద్యాధికులైన క్లార్కు ప్రతినిధుల వరకు వారివారి సమస్యలమీద సాగించిన చర్చలలో వారు కనపర్చిన చైతన్యం, కార్యదీక్ష అత్యద్భుతం. ఈ చర్చలు వారిలో నిబిడీకృతమైన నిర్మాణాత్మకశక్తిని స్పష్ట పర్చుతాయి. గుంటకల్ మహాసభకో గ్యాంగు వర్కర్ కాశ్మీర్ చెన్న తేకపులు ఇలాఅన్నారు: "రైలుమార్గానికి సంబంధించిన సీంలు. దరితర ఇనుపసామాన్లు పోతున్నాయంటే గ్రామాలలో రైతులకు. వ్యవసాయపనిముట్లకు అవసరమయిన యినుము ప్రభుత్వం సప్లయి చేయకపోవటంవల్లనే. మనం చేయవలసింది రైతులను పట్టించడం కాదు. వారికి కావలసిన యినుముకొరకు మనము కూడా వారితోకలిసి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావటం" అంటూ కర్షక-కార్మిక ఐక్యతను చాటారు.

బెజవాడ మహాసభలో ఒక బందరు గ్యాంగు మేస్త్రీ. తనకొస్తున్న కొద్దిపాటి జీతం చాలక పోయినప్పటికీ, యెవరెవరినో ఆశ్రయించి తన కూతురుకు స్కూలు ఫైనలు చెప్పించటంలో అనుభవిస్తున్న సాధకబాధకాలను వర్ణించాడు. రైల్వే పనివారం పిల్లలకు ప్రస్తుతం ఉన్న అతిస్వల్ప విద్యాసౌకర్యాల విషయంలోకూడా రైల్వేబోర్డు కనపరుస్తున్న సంకుచితవైఖరిని ఖండించాడు. పాఠశాలలను ఎక్కువ కేంద్రాలలో స్థాపించాలన్నాడు. వీటితోపాటు టెక్నికల్ పాఠశాలలను కూడా స్థాపించి, టెక్నికల్ విద్యను యిప్పించాలన్నాడు. స్వల్పజీతాలను పొందు పనివారల బిడ్డలకు ఉచితంగా చదువు చెప్పించాలన్నాడు.

మార్పు

లోగడ మహాసభలలోని విషయనిర్ణయ పరంపను చూస్తే, ఎవరో ఒక్కరు తీర్మానాలన్నిటిని యేకరువుపెట్టటం, కొంతమంది కునికిపాట్లు పడుతుండటం, కొంతమంది కబుర్లు చెప్పుకుంటుండటం, మిగిలినవారు బయట పకోడీలు చేస్తుండటం, జరుగుతుండేది. ఇప్పుడు ఆ నిరుత్సాహకర స్థితి అంతా మారింది.

గుంటకల్‌లో 800 కార్మికులతోను, పాకాలలో 200 కార్మికులతోను ఊరేగింపులు జరిగాయి. రాజకీయ కార్యకలాపం యేమీ లేకుండా, నిరుత్సాహంగా వుండే యీ కేంద్రాలలో, కార్మికుల యీ వూరేగింపులు, "కాంగ్రెసు-లీగులు ఏకంకావాలి", "జాతీయ ప్రభుత్వం యేర్పడాలి." అనే నినాదాలు, కార్మికగీతాలు ప్రజలలో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. ఈకేంద్రాలలో మిలిటరీ యూనిట్ల స్కీము లేకపోవడంవల్ల ఊరేగింపులకు యెక్కువ అవకాశాలున్నాయి. మిలిటరీ యూనిట్ల స్కీముపున్న మద్రాసు - వాల్తేరు లైనులో కార్మికులు ఊరేగింపులను జరుపుకునే పాటి స్వాతంత్ర్యహక్కు కూడాలేదు. రాజమండ్రి బ్రాంచిలో 150 మంది కార్మికులు రైల్వే కాలనీనుండి సభాస్థలానికి ఊరేగింపుగావచ్చి, కార్మికుల ఊరేగింపు జరగని కొరత తీర్చారు. రాజమండ్రి, బెజవాడ మహాసభలలో ఇతర కార్మిక సంఘాలలోని కార్మికులు దాదాపు 200 మంది పాల్గొని కార్మికవర్గ ఐక్యతనుచాటారు.

రైల్వే కార్మికులు తమ మహాసభలలో సోవియట్ రష్యాను, స్వాతంత్ర్యం కొరకు పోరాడిన ప్రజాశక్తులను అభినందించారు.

బ్రిటన్‌లో టోరీపార్టీని తొలగించి లేబర్ పార్టీని ప్రభుత్వాధికారంలోకి యెన్నుకొనిన ప్రజాశక్తులను ప్రశంసించారు. లోగడ ప్రకటించినట్లు దఫాలు వారీగా స్వయం పరిపాలనాధికారం కాకుండా, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సత్వరమే భారతదేశానికి యిచ్చివేయాలని లేబర్‌పార్టీ ప్రభుత్వమును కోరారు.

ముస్లిం లీగ్ యొక్క స్వయం నిర్ణయ హక్కును, విడిపోయే హక్కును గుర్తించాలని కోరారు. మైనారిటీ చెల్లిన స్త్రీలకు, పురుషులకు ఓటింగు అధికారమివ్వాలన్నారు. కేంద్రంలోను, రాష్ట్రాలలోను ఎన్నికలు జరిపి సంయుక్త ప్రభుత్వాలను ఏర్పరచాలన్నారు.

2 లక్షల రైల్వేకార్మికులను పనిలోనుంచి తీసివేసే ప్రభుత్వ ప్లానును తీవ్రంగాఖండిస్తూ వారిని తీసివేయకూడదని, లోగడ ఎత్తివేసిన రైల్వేలను తిరిగి స్థాపించాలని, డబుల్ ట్రాకును (ఒక రైలుమార్గానికి జతగామరొక రైలుమార్గాన్ని) నిర్మించాలని, కొత్త కొత్త రైలుమార్గాలను నిర్మించాలని, యింజన్లను తయారుచేసే పరిశ్రమలను స్థాపించాలని, కొత్త వర్కుషాపులను నిర్మించాలనికోరారు.

'ప్రజాశక్తి' దినపత్రికకు సత్వరమే అనుమతి యివ్వాలని, యూనియన్ బ్రాంచెస్‌కు జిల్లా అధికారులతో సంప్రతించే అధికారమును, ప్రధాన కార్యదర్శి ప్రెసిడెంటులకు పై అధికార్లతోపాటుగా జిల్లా అధికార్లతో చర్చించే హక్కును గుర్తించవలసినదని కోరారు.

నాటక సంఘాలను స్థాపించుకొని, మామూలు నాటకప్రదర్శనాలలో పాల్గొంటూ దుర్భర, ఆర్థిక పరిస్థితులతో నిండియుండే తమ రోజువారీ విశృంఖల జీవితాలలో కాస్త ఆనంద వాయువులను పీల్చుతుండటం అన్ని కేంద్రాలలోని రైల్వే కార్మికులకు పరిపాటి. సోదర సంఘాల్ని రైతు - కార్మికుల దుర్భర జీవితాన్ని, దీనికి కారణమైన ధనిక వర్గ ప్రభుత్వాల దోపిడీవిధానాన్ని నిర్మూలించి స్వేచ్ఛనుపొందే మార్గాన్ని చిత్రించే నాటకాలు, బుర్రకథలతోకూడిన విజ్ఞాన కార్యక్రమాన్ని ప్రదర్శిస్తుండటంచూచి, యీ కార్యక్రమాన్ని అనుసరించుదామనేఉత్సాహం చైతన్యం రైల్వేకార్మికులలో పెంపగుతున్నాయి. బెజవాడ, రాజమండ్రి, గుంటకల్ మహాసభల సందర్భంలో 'ప్రెస్ వర్కర్' మొదలగు నాటకాలను, బుర్రకథలను ప్రదర్శించి కార్మికులను తదితర ప్రజాసామాన్యాన్ని ఉత్తేజపరిచారు.

ఉప్పలూరు పంచాయితీబోర్డు ప్రెసిడెంటు బండారం

బెజవాడతాలూకా ఉప్పలూరు గ్రామం జనాభా షుమారు 3 వేలు. గ్రామంలో పంచాయితీబోర్డు ఉన్నది. బోర్డు వ్యవహారములు, పెత్తనదార్ల, చేతుల్లో వున్నది. ఈమధ్య ఎన్నికలు కూడా జరుగుటలేదు. అది వారికి అనుకూలంగా పరిణమించింది గ్రామంలోని కాల్వగట్లులు ప్రతి సంవత్సరం పాటకు పెడితే, దాదాపు 1000 రూపాయల వరకూ ఆదాయం వస్తూ వుంటుంది. ఇక బోర్డువారి అక్రమాలు చూడండి. పాటపాడిన వాడు పాటమొత్తం చెల్లించినా, రశీదులు యివ్వరు. ఎవరైనా ఇతరులు పాటపాడితే, ప్రెసిడెంటు ముఠాలోనివారు పైపాట పాడతారు. కాని చెల్లించే మొత్తం మాత్రం ఏకొద్దిగానో వుంటుంది. ఇతరులు పాట పాడుకునేందుకు ఆస్కారములేదు. ఆ వచ్చిన సొమ్మైనా జమ వ్రాస్తారాఅంటే, అదీ వుండదు. బోర్డు మీటింగులు జరిగినట్లు సంతకాలు వుంటవి. ఆచరణలో మాత్రం మీటింగులు జరుగవు. ఎవరైనా ఒకరు, ఇద్దరు బోర్డు మెంబర్లు కలుగజేసుకున్నా, లాభంలేదు. పైబోర్డులో మెజారిటీ ప్రెసిడెంటు ముఠాదే. గ్రామంలో రోడ్లు బాగుచేయించిన పాపాన పోలేదు. లెట్రిన్సు కట్టించవలసినదిగా ఇప్పటికి 2 సంవత్సరములనుండి గ్రామ మహిళా సంఘము, గ్రామ రైతుసంఘము ఆందోళన చేస్తూఉంటే డబ్బులేదు. గ్రామంలోను హరిజన పేటలోను మొలకోతుబురదతో, రోడ్లుపాడై నానా బాధలు పడుతూంటే, వాటిని బాగు చేయించలేదు సరిగదా, ఎవరికీ సంబంధించని తమ స్వలావారికి ప్రత్యేక సౌకర్యం నిమిత్తం ఒళ్లకొతుగుండా ప్రత్యేక రోడ్డువేయించుకున్నారు. హరిజనపేటకంతకూడ ఒకటే బావి. వర్షాకాలంలో అబావిచుట్టూ బురదతో దానిలో పంకులు పొర్లాడుతూవుంటవి. అక్కడపల్లాం కట్టించకపోయేమానె, నాలుగుబండ్లు రప్పిననా తోలించమని కోరితే, నిరాకరించారు ప్రెసిడెంటు ఈసంవత్సరం మరల పాటలు పెట్టబోవుచున్నారని తెలిసి నేనూ, యింకా కొంతమంది రైతులూ పంచాయితీబోర్డు ఆఫీసరుగార్కి రిపోర్టు వ్రాశాం. 15-8-45 న పాటకాలానికి పంచాయితీ ఆఫీసరుగారు వచ్చారు. పాటకు పెట్టగా, 1105 రూపాయలు పాటకు వచ్చినవి. ఈమొత్తం ఆఫీసరుగారు రశీదుయిప్పించిజమవ్రాయించారు.

క్రిందటి సంవత్సరపు లెక్కలు చూడగా పాటమొత్తం షుమారు 900 రూపాయలవస్తే 134 రూపాయలు మాత్రమే జమ వ్రాసియున్నది ఇదేమిటని గ్రామప్రజల ఎదుట, ఆఫీసరు ఎదుట, నేను యింకా కొంతమంది ప్రశ్నిస్తే ప్రెసిడెంటుగారు తలవంచుకున్నారేగాని సమాధానం లేదు. "లోగడ ప్రెసిడెంటుగిరి చేసినవారు 60, 80 రూపాయలే జమవ్రాస్తూ వచ్చారు. నేనే మెరుగు 134 రూపాయిలన్నా జమ వ్రాశాను" అని అంటున్నారు ఈ ప్రెసిడెంటుగారు. దరిమిలా హరిజనపేటకు వెళ్ళి "మీకు నూతికి పళ్ళెం కట్టిస్తా. మీటింగుకు రావలసినది" అని హరిజనబోర్డు మెంబరును పిల్వబోయారు. క్రొత్త బడ్జెటు ఆమోదింపజేసి, యీ సంవత్సరం ఆదాయం కూడా దిగమింగాలని ఈ ప్లాను అంతట హరిజనులంతా యీవిధంగా సమాధానం చెప్పారట. "ఏమండీ ప్రెసిడెంటు గారూ, మళ్ళా ఎన్నికలు వస్తున్నాయా? ఓట్లకోసమా బాబూ యీ వన్నెగమంతా? మీదయ మా కక్కరలేదులే? నడవండి." ఈ విధమైన అక్రమ చర్యలను సాగనీయకుండా పంచాయితీ ఆఫీసరుగారు తగిన చర్య తీసుకోవలసిందిగా కోరుచున్నాను.

— అద్దుమిల్లి సత్యనారాయణ

నగరఖండంలో ఆహార కొరత
కలెక్టరువద్దకు రైతునాయకుల రాయబారం

22-8-45 తేదీన ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ ప్రధాన కార్యదర్శి సందూరి ప్రసాదరావు, తూర్పు గోదావరిజిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి చింతం సత్యనారాయణ దాసు, రాజోలు తాలూకా రైతు సంఘాధ్యక్షులు అల్లూరి వెంకటకృష్ణంరాజు, జిల్లా వ్యవసాయకూలీసంఘాధ్యక్షులు కందికట్టు నాగభూషణంగారు, అల్లూరి వెంకట్రామరాజుగారు జిల్లా కలెక్టరువద్దకు డిప్యుటేషను వెళ్ళి, రాజోలు తాలూకాయందలి నగర ఖండం ఆహారసమస్య, ఇర్రిగేషన్‌సమస్య వగైరాలనుగురించి చర్చించారు.

గన్నవరం అక్విడక్టు కూలి పోవుటవల్ల ప్రధమ. పండవ పంటలకు కలిగిన నష్టం ఫలితంగా ఏర్పడిన ధాన్యంవల్ల కొరత. ధాన్యం ధర బస్తా1కి రు13-8-0, బియ్యంధర బస్తా1కి రు. 28 వరకు విపరీతంగా పెరగడంవల్ల, ఆహారసంక్షోభంవచ్చే సూచనలు కనిపిస్తున్నాయనియు, అందుచే ప్రభుత్వం యితరచోట్ల నుండి బియ్యం తీసుకొనివచ్చి 8 సెంటర్లలో డిపోలుపెట్టి, ప్రజలకు బియ్యం సప్లయి చేయాలని-కోరినారు. కలెక్టరు కరువు పరిస్థితులు ఏర్పడకుండా తగు సౌకర్యాలు కలిగిస్తామన్నారు.

జిల్లా వ్యవసాయకూలీ సంఘాధ్యక్షులు కందికట్టు నాగభూషణంగారు జిల్లాలోని వ్యవసాయకూలీ ఉద్యమాన్ని నిర్మించి రైతుకూలీ సామరస్యానికి, వ్యవసాయకూలీల ఆర్థిక సాంఘికాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. ఆయనపై స్థానికపోలీసులు అమానుషమైన ని. టి. ఆక్టు క్రింద నోటీసు జారీచేశారని, ఆ చర్య జిల్లాలోని వ్యవసాయ కూలీలలోను, రైతులలోను తీవ్రమైన అసంతృప్తినికలిగిస్తుందని, అందుచే వెంటనే నోటీసు రద్దుచేయాలని కోరగా కలెక్టరుగారు ఆలోచిస్తామన్నారు.

8వ కృష్ణాజిల్లా విద్యార్థి మహాసభ

(4వ పేజీ తరువాయి) ప్రహసనం చక్కగా ప్రదర్శించారు. గుడివాడ హరిజన బాలురు వివిధ రకాల భజనలను ప్రదర్శించారు. కైకలూరుదళం విద్యార్థుల కష్టాలను ఐకమత్యంతో తొలగించుకోవాలంటూ విచిత్ర వేషాలను ప్రదర్శించారు.

పామర్రు దళం ప్రేమగీతిక అను ఏకాంకికను, 'ప్రతిమ'లో ఒకసీనునుప్రదర్శించారు. పామర్రు బాలికలు స్త్రీలహక్కులను తెలుపు పాటతో కోలాటంవేశారు. బతకమ్మ నృత్యం చేశారు. బందరు దళం 'తెలుగుతల్లి' పాటను సమిష్టిగా గానంచేశారు. ఈవిధంగా యింకా అనేక ప్రదర్శనాలు జరిగాయి.

పామర్రు దళానికి ప్రథమ బహుమతి, బందరు దళానికి రెండోబహుమతి యివ్వబడింది. 3 వేలకు పైగా ప్రజలు ప్రదర్శనాలనుచూచి సంతసించారు. తమ బాలబాలికలు ఈ విధంగా ఆటలలో పాటలలో విజ్ఞానాన్ని వెదజల్లటం చూచి ఆశీర్వదించారు.

26 వ తేదీని మరల ప్రతినిధుల సభ జరిగింది. మిగిలిన తీర్మానాలను చర్చించాక నూతన సంవత్సరానికి కార్యనిర్వాహకవర్గం ఎన్నుకోబడింది. జిల్లాఫెడరేషనుకు ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ (బందరు) ఎన్నుకోబడ్డాడు. శ్రీరామమూర్తి (బందరు 'లా' విద్యార్థి), నాగభూషణం (బెజవాడ) జాయింటు కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు. వివిధ స్కూళ్ళ ప్రతినిధులు వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఏన్నుకోబడ్డారు.

ఊరేగింపు

సాయంకాలం 5 గంటలకు విద్యార్థుల వూరేగింపు బయలుదేరింది. మహాసభకు తోడ్పడిన గ్రామపెద్దలు కూడ ముందుండి వూరేగింపును నడిపారు. సుమారు 600 మంది బారులుతీరి, కన్నులపండువుగా పునాదిపాడు, కంకిపాడు గ్రామవీధులలో నడిచారు. మహాసభ అధ్యక్ష, ప్రారంభకులను ఎడ్లబండిపై వూరేగించారు. స్వతంత్రభారత్‌కు జై; విద్యార్థి సంఘాలకు జై; అను నినాదాలు ప్రతిధ్వనించాయి.

7 గంటలకు వూరేగింపు సభావేదికవద్దకు చేరింది. వీరమాచనేని మధుసూదనరావు విద్యార్థిజెండాను ఎగురవేస్తూ, ఉత్సాహం ఉట్టిపడునట్లు ఉపన్యసించారు. విద్యార్థి ఫెడరేషను కృషిని తెలిపారు. మహాసభకు సాయపడిన పెద్దలకు కృతజ్ఞత వందనాలు.

మహాసభ

తమిళనాడు విద్యార్థినాయకుడు రామకృష్ణగారు యింగ్లీషులో మృదుమధురమైనభాషలో ఉపన్యసించారు. అఖిలభారత విద్యార్థి ఫెడరేషను కార్యక్రమంసరియైనదని గత8 యేండ్ల చరిత్ర, ఎలా రుజువుచేసిందో స్పష్టపరిచారు. కాంగ్రెసు గత 8 సంవత్సరాలుగా ఫాసిస్టు దౌష్ట్యానికి పాలుపడిన అబిసీనియా, స్పెయిన్, చీనా ప్రజలకు సానుభూతిని తెలుపుతూ వచ్చింది. మనం ఏప్రజల విజయాన్ని కోరామో, ఆప్రజలు నేడు జయం పొందారు. కాంగ్రెసు ఎవరి దుండగాలను నిరసించిందో ఆ ఇటలీ, జర్మనీ, జపాను ఫాసిస్టులు ఓడిపోయారు. ప్రజా రాజ్యమైన సోవియట్ యూనియన్, ఎర్రసైన్యం ప్రపంచంలో తన కెదురులేదని విర్రవీగిన నాజీసైన్యాల పీచమడచింది. మేనెలలో బెర్లిన్ నగరంపై విజయపతాక నెగురవేసింది. మూడు నెలలయిందో లేదో, ఆగస్టు 9 వతేదీన ఎర్రసైన్యం జపాను దురాక్రమణదారులపై విజృంభించింది. 14 యేండ్లనుంచి పీడించబడుతున్న చైనా ప్రజలను విముక్తిచేసింది. బలవత్తరమైనదన్న జపాను క్వాంటంగు సైన్యం మూన్నాళ్ళలో చిందరవందరయింది. మిత్ర రాజ్యాలకు జపాను పాదాక్రాంతమయింది.

నాటకంలో ధర్మం జయించినపుడుసైతం మనం సంతోషించుతాము అలాంటపుడు లోకవిపత్తును దాటిపోయి, మనం ఆశించిన ప్రజల విజయం వచ్చినపుడు మనం సంతసించడంధర్మం కాదా? అని రామకృష్ణప్రశ్నించాడు. మహాసభ హర్షధ్వనులతో జవాబిచ్చింది. కొంతమందికి బ్రిటిషుసామ్రాజ్యవాదులేజయించారనుసందేహముంది; అదిగో ఇంగ్లండువైపు చూడండి; భారత స్వాతంత్ర్యానికి ఆటంకముగా నిలచిన అమెరీ-చర్చిల్ ముఠాను ఓడించి, ప్రజలు ఎలా జయించారో ఒకసారి చూడండి;

రామకృష్ణ నేటి ప్రపంచ పరిస్థితులలో జాతీయైక్యత అవసరాన్ని వివరించాడు. సిమ్లా సమావేశం విఫలమవడానికి కారణాలు తెలిపాడు. కాంగ్రెసు - లీగులకు సమాన ప్రాతినిధ్యంతో తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని నిర్మించాలన్నాడు. విద్యార్థి ఫెడరేషనుపైన, కమ్యూనిస్టులపైన నిందలువేసే వారికి ప్రజలే సమాధానం చెబుతారన్నాడు. 1942 నుండి ఫెడరేషను అనుసరించిన పాలసీయే సరియైనదని చరిత్రరుజువు చేసిందన్నాడు. పట్టాభిలాంటివారు వెనకటిసర్క్యులరును సమర్థించుకోబోయి, ఎలా బోల్తా కొట్టారో, మష్రూవాలా ఎలా పొరబాటును అంగీకరించవలసివచ్చిందో తెలియజేశాడు. విద్యార్థులు తమ యిబ్బందులను తీర్చుకుంటూ భారత స్వాతంత్ర్యానికి, ఆంధ్ర విజ్ఞానాభివృద్ధికి పాటుపడాలని కోరుతూ వుపన్యాసం ముగించాడు.

సందేశాలు

క్రికెటుఆటలో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మేజరు సి. కె. నాయుడు, విద్యార్థులు ఆటలలో పాల్గొనాలనీ, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనీ కోరుతూ సందేశం పంపాడు. కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సభ్యుడైన హరికృష్ణ మెహతాబ్ విద్యార్థులు స్వాతంత్ర్యం కొరకు ఐక్యతతో కృషిచేయాలని సందేశంపంపారు. సుప్రసిద్ధ పత్రికా రచయిత అహమ్మద్ అబ్బాస్ నూతన ప్రపంచ నిర్మాణానికి దారితీయాలని విద్యార్థులను ఆశీర్వదించారు.

కృష్ణాజిల్లా కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శి కంతంనేని బలరామారావుగారు మహాసభకు అభివందనాలు తెలిపారు. తాము చదువుకొనే రోజులలో యిలాంటి సంఘటిత ఉద్యమం లేదన్నారు, ఉపాధ్యాయులు యీఉద్యమాన్ని చూచి భయపడవవసరం లేదనీ, ఉపాధ్యాయులకు న్యాయమైన జీతాలుండాలనీ విద్యార్థులు జరుపుతూన్న ఆందోళనను గమనించాలన్నారు. బాగా చదువుకోవాలనే ఫెడరేషను తీర్మానం అమలుజరుపడానికి ఉపాధ్యాయులు తోడ్పడాలనీ, వారు విద్యార్థులకు స్నేహితులుగా, మార్గదర్శకులుగా వుండాలనీ కోరారు.

రాష్ట్ర విద్యార్థిఫెడరేషను కార్యదర్శి ఎన్. వి. ఎరసయ్య తరువాత ఉపన్యసించుతూ, తల్లితండ్రులు పిల్లల విద్యాభివృద్ధి యెడల శ్రద్ధవహించాలనికోరారు. పట్టణాలకు చదువుకొరకు వెళుతున్న తమ బిడ్డలు వసతిలేక, హోటలు తిండి పడక, పడే బాధలను వర్ణించారు. ఈ యిబ్బందులను తొలగించడానికి ఆందోళనచేసి విద్యార్థులకు సాయపడాలని కోరారు. విద్యార్థులు డాక్టర్లుగాను, సైంటిస్టులు, ఇంజనీర్లుగానువృద్ధిపొంది ఆంధ్రభూమిలో పరిశ్రమలను పెంపొందించి ధన ధాన్య సంపదలను వృద్ధిచేయాలని కోరారు.

అధ్యక్షులు అన్నే రాధాకృష్ణమూర్తిగారు విద్యార్థి సంఘ ఆశయాలను గురించి ముచ్చటించారు. పతాకంపైవున్న ఆశయాలు మహోత్కృష్టమైన వన్నారు. "స్వాతంత్ర్యం - శాంతి-అభ్యుదయం" అనే లక్ష్యం ప్రజలందరికీ జ్యోతివంటిదన్నారు. తెలుపు, నలుపు భేదం, జాతిభేదం లేకుండా అన్నిదేశాలకు, అందరి ప్రజలకు స్వాతంత్ర్యం ఉండాలన్నారు. అపుడే నిజమైన శాంతి ప్రపంచంలో వుంటుందన్నారు. దీనినే లిట్వినాఫ్ "అన్నిదేశాలూ కలిసి దురాక్రమణను ఎదుర్కోవాలని, అన్నిదేశాలు శాంతిస్థాపనకు కలిసి పూనుకోవాలని, అన్నాడు. అలాంటి ప్రపంచానికి నేడు పునాదులు పడుతున్నాయి. ఆ విషయాన్నే ప్రారంభకులైన రామకృష్ణాగారువిశదపరచారు. విజ్ఞానజ్యోతి సర్వతోముఖమైన అభ్యుదయానికి పాటుపడాలని కోరారు.

విద్యార్థులు ఊరేగింపులో యిచ్చిన నినాదాలలో రెండు ఎక్కువగా తమ్ము ఆకర్షించాయన్నారు. ఉపాధ్యాయుల జీతాలు హెచ్చు చేయాలని మీరు కోరారు. నేనూ ఉపాధ్యాయుడ్నే. భావి పౌరులు కాబోతున్న మీరు వంతుల్ల కష్టాలను గుర్తించి, వారి జీతాలు హెచ్చాలని కోరడం మీ వుద్యమ మెంత బాధ్యతగలదో తెలుపుతూందన్నారు. రెండోది: 18 యేండ్లు వయస్సు దాటిన వారందరికి ఓటింగు హక్కును కాంక్షించుతూ ఇచ్చిన నినాదమన్నారు. ఇదికూడ, ప్రజలందరికి రాజకీయాధికారం కావాలనే ప్రజాస్వామిక వాంఛను తెలుపుతూంది. ఇవి మహోత్కృష్టమైన మీ ఆశయాలకు ప్రతిబింబ మన్నారు. మహాసభను జయప్రదమొనర్చిన వారందరికీ కృతజ్ఞత తెలిపారు.

తరువాత మధుసూదనరావు గ్రామపెద్దలు, బిడ్డలు తమకు తోడ్పడినందులకు వందనాలు అర్పించారు. వచ్చిన నాయకులకు, ప్రతినిధులకు అభివందనాలతో మహాసభ ముగిసింది.

తరువాత కృష్ణాజిల్లాదళం "కష్టజీవి" బుర్రకథను చెప్పింది. 5 వేల ప్రజలకు పైగా రాత్రి 1-30 గంటవరకు తూర్పుని శ్రద్ధగా విని సంతసించారు. "కాంగ్రెసు బుర్రకథ అంతా తిప్లే. యిదెంత చక్కగా వుందో చూడమ్మా!" అని గ్రామమహిళలు మెచ్చుకున్నారు. పీళ్ళు "కాంగ్రెసును తిడతారన్నారు. అదంతా పట్టిదేనకా!" అని పౌరులు విస్తుపోయారు. ఈరెండురోజులు మాగ్రామం కలకలలాడుతూ, పండుగవలె గడచిందని గ్రామస్థులంతా సంతృప్తి చెందారు.

పుస్తక పరిచయం

బాల
(పిల్లల సచిత్రమాస పత్రిక)

సంపాదకుడు: న్యాయపతి రాఘవరావుగారు
విడిప్రతి: అరణాలు — సంవత్సర చందా రు. 4-8-0
ప్రతులకు: మేనేజరు, 'బాల': 20 సుందరేశ్వర్‌వీధి, మైలాపూర్, మద్రాసు. అని వ్రాయాలి.

ఆంధ్ర దేశంలో బాలబాలికల కోసం ఇంతవరకు ప్రత్యేకంగా ఒక పత్రిక అంటూ లేదు. బాలబాలికలకోసం ప్రత్యేకంగా కొంత స్థలం వినియోగించే పత్రికలు కూడా బహుస్వల్పం. అట్టి పరిస్థితులలో వెలువడిన 'బాల'కు స్వాగతం ఇస్తున్నాం.

'బాల' ప్రథమ సంచిక ఎంతో ఆకర్షవంతంగాఉంది. బాలబాలికలను ఉర్రూతలూగించే కథలు, పిట్టకథలు, పొడుపుకథలు, నాటకములు పాటలు ఉన్నాయి. విజ్ఞాన విషయాలున్నాయి. బాల బాలికలు వ్రాసే రచనలు ప్రచురించి, వారిని ప్రోత్సహించారీ సంచికలో. బాలబాలికల రచనాశక్తిని పెంపొందింప జేయడానికి ఇక ఎంతైనా సహాయకారి అవుతుంది ఇది. పత్రికను నిర్వహించ బూనుకొన్న సంపాదకులను ఎంతైనా అభివందించాలి.

ఆంధ్రదేశంలో అనేక బాల సంఘాలున్నాయి. అవి చేస్తున్న కృషి కూడా ఎంతో శ్లాఘనీయంగావుంది. ఆదర్శవంతంగా పని చేసే బాలసంఘాల కార్యకలాపాలను కూడా తెప్పించి 'బాల'ను ప్రచురించ ప్రయత్నించాలి. 'బాల' ఇంకా ఎక్కువ బొమ్మలతో, ముఖ్యంగా పిల్లల నాకర్షించడానికి రంగు రంగుల బొమ్మలతో, ప్రచురించాలి. ఈపత్రికలో బాలబోర్ల వాడిన చిన్న 'టైపు' మాని, అక్షరాలు పెద్దవి వాడితే, పిల్లలకు చదువుకోడానికిసులభంగా ఉంటుంది. పిల్లలస్థాయిని మించిన రచనలూ, పిల్లల లేతవయస్సులో ఒక విషయమైదురభిప్రాయం కల్గించే విషయాలు లేకుండా సంపాదకులు చూడాలి. లలితమైన శైలిలో శాస్త్రీయ విషయాలను సుబోధకంగా చెప్పే వ్యాసాలు సంపాదించాలి. సంపాదకులిందుకు పూనుకొంటారనీ, రచయితలందుకు సహకారం చేస్తారనీ, ఆంధ్ర బాలబాలికలను విజ్ఞానవంతులుగాతయారు చేయడానికి 'బాల'చక్కగా తోడ్పడగలదనీ, ఆశించుతున్నాం. 'బాల' ఇంటింటాబాలబాలికల చేతుల్లో వెలయాలని కోరుతున్నాం.

స్వీకారం

తుఫాను: (సాంఘిక నవల)
రచయిత: అడివి బాపిరాజుగారు
వెల: నాల్గు రూపాయలు
ప్రతులకు: రచయిత పేరిట, కళాపీఠము, నాంపల్లి, హైదరాబాద్ అని వ్రాయాలి

రాగమాలిక: (కథా సంపుటి)
రచయిత: అడివి బాపిరాజుగారు
వెల: రూపాయిన్నర
ప్రతులకు: రాచకొండ నరసింహమూర్తి తేనరీ హైస్కూలు, మైలాపూర్, మదరాసు అని వ్రాయాలి.

ప్రజాశక్తి నిధి వసూళ్లు

క్రిందటి సంచికలో ప్రకటించబడిన మొత్తం 48,650–3–6

కృష్ణాజిల్లా

నందిగామ తాలూకా

శ్రీయుతులు

వావిరెడ్డి వెంకటేశ్వరరావు, వీరులపాడు	100	0 0
దావ వెంకటరావు ..	75	0 0
మార్యదేవర వెంకయ్య ..	21	0 0
దావ వీరభద్రయ్య ..	25	0 0
దావ కృష్ణయ్య ..	10	0 0
శ్రీమతి పాడవల్లి హైమవతి..	5	0 0
.. వట్టికొండ శ్రీదేవమ్మ..	10	0 0
.. లక్ష్మీకాంతమ్మ చింతలపాడు	5	0 0
(2 వెండి పట్టాలు)		
వీరులపాడు గ్రామంనుండి చిల్లరగా	3	0 0
చింతలపాడునుండి చిల్లరగా	2	0 0
బెజవాడ సుబ్బారెడ్డి గండేపల్లి ఒక బంగారు వుంగరం		
వీరులపాడు గ్రామంలో బుర్రకథ చెప్పటద్వారా	20	0 0

బెజవాడ తాలూకా

యం. నాగభూషణరెడ్డి ప్రొద్దుటూరు	100	0 0
గన్నే గంగాధరరావు కోట్లవల్లూరు	300	0 0

బెజవాడ టౌన్

శ్రీమతి కొండపల్లి కోటేశ్వరమ్మ	5	0 0
.. కంభంపాటి మాణిక్యాంబ	5	0 0
.. కాట్రగడ్డ వెంకటలక్ష్మమ్మ	10	0 0

డి. సి. ద్వారా

ప్రైజర్స్	30	0 0

గుడివాడ తాలూకా

మలిరెడ్డి షణ్ముఖారెడ్డి జొన్నపాడు	400	0 0
మలిరెడ్డి సీతారామిరెడ్డి ..	350	0 0
పీలం వెంకటరెడ్డి మహేశ్వరపురం	225	0 0
ఉప్పలపాటి చంద్రశేఖరరావు రిమ్మనపూడి	10	0 0
పొట్లూరి శ్రీనివాసరావు రామాపురం	8	0 0
కాకరాల వెంకటేశ్వర్రావు ..	15	0 0
పరుచూరి బైరాగిరావు, గుడివాడ	7	0 0
అడ్డుమిల్లి, ప్రకాశరావు కోడూరు	60	0 0
కొల్లారెడ్డి నాగభూషణం, లింగవరం	25	0 0
వేములపల్లి సీతయ్య, శేషాద్రిపురం	5	0 0
శేషాద్రిపురం రైతులమందిచిల్లరగా	9	0 0
రామాపురం, వెన్ననపూడి గ్రామాలమంది చిల్లరగా	5	0 0

గన్నవరం తాలూకా

యలమంచిలి రామకృష్ణ అగినపర్రు	100	0 0
శ్రీమతి నాగళ్ళ రాజేశ్వరమ్మ కాటూరు.	2 బంగారు గాజులు	
శ్రీమతి మాదినేని అన్నపూర్ణమ్మ కాటూరు.	1 బంగారు నగ	
.. మానికొండ సూర్యావతి	1 బంగారు గాజు.	

దివి తాలూకా

కాకర్ల గంగయ్య పెదముత్తేవి	1,116	0 0
బండి వెంకటసుబ్బయ్య మంత్రివారి పాలెం	50	0 0
చిగులూరు వెంకట్రామయ్య ..	15	0 0
లింగం వెంకట కుటుంబరావు ..	25	0 0
దోనేపూడి చిన వెంకటసుబ్బయ్య..	25	0 0
కొండపల్లి వెంకట్రామయ్య ..	10	0 0
దొక్కా వెంకటేశ్వర్లు విడుమోలు	9	0 0
దొక్కా పున్నయ్య ..	9	0 0
దొక్కా అంజయ్య ..	9	0 0
కుందేటి లక్ష్మయ్య ..	19	0 0

నెల్లూరు జిల్లా

డి. వి. శేషయ్య, తిక్కవరం	5	0 0
అవంతోజు పిద్దయ్య తిప్పగుంటపాలెం	[illegible]	0 0
చిల్లరవసూళ్ళు	5	0 0

తూర్పుగోదావరి జిల్లా

మోటుపల్లి శ్రీరామమూర్తి	5	0 0
చిల్లరవసూళ్ళు	2	0 0

కర్నూలు జిల్లా

కంభం తాలూకా

మోతుగుండం గ్రామం

టి. అంకిరెడ్డి	5	0 0
ఎ. కె. కోటారెడ్డి	5	0 0
అవులం కోటారెడ్డి	5	0 0
ఉప్పుయారి సుబ్బారెడ్డి	5	0 0
రాళ్ల గురువారెడ్డి	5	0 0
అవులం చెంచిరెడ్డి	5	0 0
బోదనపు పిచ్చిరెడ్డి	5	0 0
వేణుగోపాలరెడ్డి	5	0 0
ఇతరవసూళ్లు	27	0 0

మార్కాపురం

వి. వేమారెడ్డి	5	0 0
వి. హెచ్. రామిరెడ్డి	5	0 0

తురిమెళ్ళ

బి. కాయన్న	25	0 0
చోళ్ళవీడుగ్రామం	18	0 0

కర్నూలు పట్టణం

జానకిరామయ్య	60	0 0
వి. హనుమంతరావు	20	0 0
ఎ. నరసింహులు	5	0 0

నందికోట్కూరు తాలూకా

రామచంద్రయ్య	150	0 0
ఇద్దరు అభిమానులు	10	0 0

నంద్యాల తాలూకా

నెర్వాటి బాలసుబ్బయ్యశెట్టి	52	0 0
రామశాస్త్రిద్వారా	15	6 0

అనంతపురం జిల్లా

తాడిపత్రి తాలూకా

తిమ్మెపల్లె

మొలకతాళ్ళ పెద్దనాగిరెడ్డి	5	0 0
.. చన్నప్ప	6	0 0
మొలకతాళ్ళ నాగిరెడ్డి	5	0 0
చిల్లరవసూళ్ళు	7	8 0

చీమలవాగు

కొండేలు చిన్న ఓబులేసు	5	0 0
శ్రీమతి వల్పరెడ్డి రంగమ్మ	10	0 0
డి. దస్తగిరి సాహెబు	5	0 0
చిల్లరవసూళ్లు	5	0 0
దీక్షితులు	10	0 0

అనంతపురం తాలూకా

కాటమయ్య, ప్రసన్నాయనపల్లె	5	0 0
నారాయణరెడ్డి, సోదనపల్లె	5	0 0

గుంటూరు జిల్లా

దుర్గా హైమావతి	80	0 0
ఉప్పుగుండూరు వ్యవసాయికూలీలు	7	12 0

రాష్ట్ర కమిటీ వసూళ్ళు

వి. బైరాగి, కాన్పూరు	5	0 0
ఎస్. ఎస్. ఎన్. గుప్త, సికింద్రాబాద్	5	0 0
సింగంపల్లి బంగారయ్య, వందలపాక	3	0 0
కె. వెంటస్వామి, పాకాల	6	8 0
అనవర్తి వెంకటరావు, కామూరు	5	0 0
కొడవగంటి కుటుంబరావు, పార్టీకాలనీ, బొంబాయి	20	0 0
మొత్తం	47,569	3 6

వేరుశనగ పైరుకు కొత్తతెగుళ్లు

గుంటూరు తాలూకా గ్రామాల్లో యీ మధ్య వేరుసెనగ పైరుకు విపరీతమైన కొత్తరకపు తెగులు ప్రవేశించింది. యకరం 1 కి 4-5 పుట్లు పండే భూములలో యీ సంవత్సరం పది మణుగులుకూడ పండలేదు. దొండపాడు, తుళ్లూరు గ్రామాదుల్లో యీ తెగులువల్ల వచ్చిన నష్టం 2 లక్షల రూపాయలని అంచనా వేస్తున్నారు. చెట్టు ఆకులన్నీ ముడతలుపడి, పల్లని రంగుగల సన్నని పురుగు చెట్లచివర ఆకులలో ప్రవేశించుతుంది. మొదట గుర్తుగుర్తుగా బయలుదేరి తరవాత గొక్కలు గలిగి లేచుచుండును. పైరు ఎండిపోవుచున్నది వ్యవసాయ పరిశోధకులు యీ తెగులను నివారించే మార్గం కనిపెట్టవలసిందని శ్రీ కొత్తమాసు వెంకయ్యగారు (దొండపాడు), గుర్రం కోటయ్యగారు (పొన్నెకల్లు) విజ్ఞప్తి చేస్తున్నారు.

★

నందిగామ తాలూకాలో కంచకచర్ల, పేరుకలపాడు, పొన్నవరం, జమ్మవరం, తోదాద మొదలైన గ్రామాల్లోకూడ వేరుసెనగకు పురుగు పట్టి, పైరును నాశనం చేస్తోంది. ప్రతి మొక్కకు కొన్ని వందల చొప్పున పేను మాదిరి పురుగు ప్రవేశిస్తోంది. పురుగు ప్రారంభమైన వారం రోజులకు మొక్క ముడుచుపోయి, ఎండిపోతుంది. కాయలుగా మారుతున్న ఊడలు గిడసబారి, కుళ్ళిపోతున్నాయి. తాలూకా ఎగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటరును తీసుకువచ్చి, పరీక్షచేయించగా, యిలాంటి రోగము వేరుసెనగకు యింతవరకు లేదని, కోయంబత్తూరుకు పంపి పరీక్ష చేయించుతామని, జవాబు చెప్పారు. ఈ తెగులువల్ల రూపాయికి 0-2-0 వంతు నష్టమయింది. కంచెల మొదలైన ప్రాంతాలలో రెడ్ కేటర్‌పిల్లరు ప్రవేశించి, పంటను పాడుచేస్తోంది. వెంటనే వ్యవసాయశాఖవారు, యీ తెగుళ్ళనుగూర్చి పరిశోధించి, క్రిమి నివారణకు పూనుకోవలసిందని నందిగామ తాలూకా రైతుసంఘ కార్యదర్శి వీరమాచనేని వెంకటేశ్వరరావుగారు హెచ్చరిస్తున్నారు.

సోవియట్ సాహిత్యం

★

సోవియట్ దేశం-భూతల స్వర్గం	1 0 0
సోవియట్ రైతు	0 4 0
నేటి సోవియట్ యూనియన్	2 0 0

ప్రపంచంలో సోవియట్‌ప్రాముఖ్యత రోజు రోజుకూ ఎక్కువౌతుంది -

సోవియట్ రాజనీతి రోజు రోజుకూ ప్రస్ఫుటమౌతుంది -

పీడిత ప్రజలకు, పాలిత జాతులకు సోవియట్ మార్గదర్శి, శ్రీరామరక్ష -

సోవియట్ చరిత్ర, సాధన, సంపత్తి-

స్వాతంత్ర్యం కావాలనే ప్రతి ఆంధ్రుడు,

పరిశ్రమలు కావాలనే ప్రతి ఆంధ్రుడు,

రాష్ట్రస్వత్వం కావాలనే ప్రతి ఆంధ్రుడు తప్పక తెలుసుకోవాలి.

ప్రతులకు

ప్రజాశక్తి కార్యాలయం, బెజవాడ.

ప్రజా ప్రచురణాలయం, ఖద్దిగూడ హైదరాబాద్ దక్కన్

(3 వ పేజీతరువాయి) అంగీకరించడం ద్వారా ఐక్యతను నిర్మించవలెనని కోరుతున్నాను."

విజ్ఞప్తి

కొద్ది రోజుల్లో జరుగనున్న కాంగ్రెసు వర్కింగుకమిటీ సమావేశంలో యీసమస్య చర్చకు వస్తుందని మౌలానా అజాద్ తెలియజేస్తున్నారు. అయితే, సూత్రప్రాయంగా మాత్రం స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించి, ముస్లింలీగ్‌ని దెబ్బకొట్టాలని చూచే జాతీయ ముస్లిం దేశంలో లేకపోలేదు. ఎన్నికలలో లీగ్ అభ్యర్థుల్ని ఓడించడానికి దీన్ని ఒక యెత్తుగా వారు భావిస్తున్నారు. ఈధోరణికే వర్కింగ్ కమిటీ కూడా వస్తే, ప్రయోజనంకంటె ప్రమాదమే ఎక్కువ। స్వాతంత్ర్యం, స్వపరిపాలనాధికారం, ప్రజాపరిషత్తు - వీటికోసం ఆందోళన చేయమని రాష్ట్రపతి అజాద్ పిలుపు యిచ్చారు. వీటికై మన ప్రధాన రాజకీయ సంస్థలు రెండూ కలిసి పనిచేసినప్పుడే, మన ఆశయం సిద్ధిస్తుంది. ఈ వివాదాంపై కాంగ్రెసూ, ముస్లింలీగూ ఎన్నికలకు దిగబడితే, సామ్రాజ్యవాదులు మూట, ముల్లె కట్టుకొని దేశం విడిచిపెట్టవలసిందే। ఈవిషయాన్ని కాంగ్రెసు పెద్దలు ఎంత త్వరగా గుర్తించితే అంత మంచిది.

ప్రజాశక్తి

వోటర్ల జాబితాలు - రైతు సేవకుల కర్తవ్యం

●

మద్రాసురాష్ట్ర శాసనసభల వోటర్ల జాబితాల సవరణలను పూర్తి చేయడానికి అక్టోబరు 31 వ తేదీ ఆఖరురోజుగా ప్రభుత్వం ప్రకటించింది. మైనారిటీ వెళ్ళిన ప్రతిస్త్రీకి పురుషునికి వోటిచ్చే హక్కు ప్రజాస్వామిక దేశాలలోవుంది. కాని మనదేశంలో సామ్రాజ్యవాద ప్రభుత్వం అట్టి ప్రజాస్వామిక హక్కును వ్యతిరేకిస్తూ, జమీందారీ, ధనిక వర్గాల ప్రాబల్యాన్ని అపేక్షించి, "ఆస్తిగలవారికేవోటు" అనే పద్ధతిని అవలంబిస్తోంది. అందువల్ల నూటికి 13 గ్గురికు మాత్రమే వోటిచ్చే హక్కు కలిగింది. ఈ ప్రతిపత్తి మీదనే ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇందులో కూడా అర్హతగల వారి కనేకమందికి, జమీందారుల మోసాలవల్లా, గ్రామోద్యోగుల అవకతవకలవల్లా వోటుహక్కు లభించడం లేదు.

1935 రాజ్యాంగచట్టం ప్రకారం ఈక్రింది అర్హతలు గలవారికి వోటిచ్చే అధికారం కలిగింది.

(1) చదువను వ్రాయను నేర్చినవారందరికి

(2) ప్రతి పట్టాదారుకు

(3) ప్రతి కౌలుదారుకు

(4) జమీందారుకుగానీ, ఈనాందారుకుగాని, ప్రభుత్వానికిగాని, రు 10 లు శిస్తు చెల్లించేవారి భార్యకు

(5) భూకామందుకు రు 10 లు విలువగల రిజిస్టరు కౌలు చెల్లించే కౌలుదారు భార్యకు

(6) మనోవర్తి పుచ్చుకొంటున్న వితంతువుకు

(7) వృత్తి పన్నుగాని, ఆస్తిపన్నుగాని రు 3 లకు తక్కువ లేకుండా చెల్లించేవారి భార్యకు

(8) పట్టణాలలో (మ్యునిసిపాలిటీస్) ఇండ్లు వగైరా అస్తులున్న వారికి

(9) పట్టణాలలో సంవత్సరానికి రు 60 లకు తక్కువగాని అద్దెచెల్లిస్తూ సంవత్సరకాలంనుండి కాపురమున్నవారికి

(10) షెడ్యూల్డు తరగతుల వారైతే - పట్టణాలలో కాపురమున్నవారికి, పల్లెలలో స్వంత యిల్లు (అనగా రెండు విస్తాళ్ళ పాక కంటె చిన్నది గానిది) కలవారికి

(11) సైన్యంలోచేరిన వారికి

ఈ అర్హతలు గలవారు సైతం ఆయా నియోజక వర్గాలలో అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో (అనగా జులై 1 నుండి జూన్ 30 వరకు) కనీసం 120 రోజులు కాపురమున్నవారై వుండాలి. ఈ వోటర్లే అసెంబ్లీకి, లోకల్‌బోర్డులకు, పంచాయితీలకు, మునిసిపాలిటీలకు కూడా వోటర్లవుతారు. మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిలుకైతే, రు 300 లు శిస్తు చెల్లించే రైతుకు, రు 50 లు శిస్తుచెల్లించే హరిజన రైతుకు, ఆదాయపు పన్ను చెల్లించేవారికి-మాత్రమే వోటుంటుంది.

పైన చెప్పబడిన అర్హతలనుబట్టి గ్రామోద్యోగులు వోటర్ల జాబితా తయారుచేయాలి. కాని వారు సాధారణంగా కౌలుదార్లను, పట్టాదారుల భార్యలను, మనోవర్తిపుచ్చుకుంటున్న వితంతువులను ఎస్టేటు గ్రామాలలోజాయింటు పట్టా క్రిందవున్న రైతులను, షెడ్యూల్డు కులాలవారిని, తమకు యిష్టంలేని వారిని విడిచిపెట్టి జాబితాలు తయారుచేస్తుంటారు. ఎస్టేటు గ్రామాలలో జమీందార్లు, మొఖాసాదార్లు, ఈనాందార్లు పట్టాలు విడదీయకుండా చేసి, జాయింటు పట్టాలో తమ కనుకూలురైన వారిని మాత్రమే జాబితాలో చేర్పిస్తారు. తమకు శిస్తులు, కౌళ్లు, యిచ్చేవారికి కూడా వ్యతిరేకులైతే వోటులేకుండా చేయడానికి శతవిధాలా ప్రయత్నిస్తారు. అందుచేత మనం అర్హతగల వారందరికి వోట్లహక్కు సంపాదించడానికి వెంటనే పూనుకొని, క్రింది విధంగా కృషిచేయాలి:

1. ఎస్టేటు గ్రామాలలోని జాయింటు పట్టాలలో ఎంతమంది భాగస్వాములుంటే, అంతమందిని (అవిభక్త కుటుంబంలోని అన్నదమ్ములకు వర్తించదు),

2. రొపాయికారి అమరకం (కునాటి రైతుభుక్తం) ప్రకారం అర్హతగలిగిన రైతులందరినీ,

3. అర్హతలు గలిగిన స్త్రీలనందరినీ

4. చదువను, వ్రాయనేర్చినవారందరినీ

5. వృత్తిపన్ను చెల్లించేవారినీ, ఆస్తిపన్ను చెల్లించేవారినీ, జాబితాలో చేర్పించాలి.

6. షెడ్యూల్డు కులంవారికి ప్రత్యేక అర్హతలనుబట్టి వోట్లు సాధించాలి.

క్రింది ఉద్యోగులు చేర్చడానికి నిరాకరిస్తే, అప్లికేషన్ ఫారాలలో అర్హతలనునమోదుచేసి, కలెక్టరుకు పంపాలి. అప్లికేషన్ ఫారాలు తాలూకా ఆఫీసులో దొరుకుతాయి. గ్రామోద్యోగులు ప్రభుత్వ ప్రకటనలను, వోటర్ల జాబితాలను బహిరంగంగా ప్రకటించేలా చేయాలి. వోటర్ల జాబితాలో ఏయే అర్హతలు గల వారిపేర్లులేవో చూచి, వెంటనే చేర్పించాలి.

— నండూరి ప్రసాదరావు,

(కార్యదర్శి ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం)

మొగుణ్ణి కొట్టి మొత్తుకొనే పటిల్ ముఠా

బొంబాయికొట్లాటకు కారకులెవరు?

———///———

భారత కమ్యూనిస్టుపార్టీ బొంబాయి కమిటీ కార్యదర్శి డి. యస్ వైద్యా ఇలా ప్రకటించుతున్నారు:

"లాల్‌బాగ్ మీటింగులో 'దెబ్బలాట' విషయమై శంకరరావ్‌దేవ్‌గారు ప్రకటించిన విషయాలు సత్యదూరంగా వున్నాయి. ఈ మీటింగులో జరిగిన రౌడీ చర్యలను కమ్యూనిస్టులకు అంటకట్టడం ఈనాడు కొత్తది కాదు. కొందరు కాంగ్రెసువాదులు సాగిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక దండయాత్రలో ఇది ఒక భాగమే.

అసలు, వాస్తవిక విషయాలేమిటి? బొంబాయిరాష్ట్ర కాంగ్రెసుకమిటీ యొక్క కార్మిక ఉపశాఖ, బహిరంగసభ జరుపుతుందనీ, కాంగ్రెసు నాయకు లుపన్యసించుతారనీ, ప్రకటించింది. గత మూడు సంవత్సరాలుగా, కమ్యూనిస్టులమైన మేము కాంగ్రెసు నాయకుల్ని విడుదల చేయాలని, కాంగ్రెసుపై నిషేధం తొలగించాలని, కార్మికులలో ప్రచారం చేస్తూ వచ్చాం. అందుచే కార్మికులు మీటింగుకు వెళ్ళడానికి ఉత్సాహపడ్డారు. అధిక సంఖ్యాకులు మీటింగుకు హాజరయ్యారు.

మీటింగును ఆర్గనైజు చేసిన వారు గాభరాపడటంవల్ల అసలీ గందరగోళం ప్రారంభమైంది. కార్మికులు నినాదాలిచ్చుకుంటూ ప్రవేశించగానే, వలంటీర్లు వారిని లాఠీలతో మోదారు. చిన్న చిన్న ఘర్షణలు జరిగాయి. కాని తర్వాత కార్మికులు గల్లంతు లేకండా సర్దుకొని ప్రశాంతంగా సభలో కూర్చున్నారు. కార్మికులలో కొందరికి దెబ్బలవల్లబాగా రక్తం కారుతోంది. ఇదంతా శంకరరావ్ దేవ్‌గారు ఇంకా మీటింగుకు రాకముందే జరిగింది. శంకరావ్‌దేవ్‌గారు ఒక గంట ఆలస్యంగా వచ్చారు. కార్మికులంతా నిశ్శబ్దంగా ఆయన ఉపన్యాసం వినడానికి సావధానంగా కూర్చున్నారు. కాని మీటింగును ఆర్గనైజ్ చేసినముఠా, దెబ్బలాట కావాలనే మన సత్వంతో కాచుకుకూచున్నారు. ఆప్రాంతంలో ఎవరు పెద్ద మనుష్యులో, ఎవరు గూండాలో కార్మికులు ఎరుగుదురు. కొందరు గూండాలు, వస్తాదులు, కార్మికులకు విరుద్ధమైన పనులు చేయుటలో ప్రసిద్ధిచెందిన ఒక జూదగాడు- మోహెన్ అనే అతడు - మీటింగుచుట్టూ తారాడటం కార్మికులుచూశారు. వేదిక వెనుక ప్రక్కను, చౌకచుట్టూ కున్న దాబాలపైనను, లాఠీలు, రాళ్ళు ఉంచారు. కొందరు రౌడీలు బహిరంగంగానే కత్తులు ప్రదర్శించడం మొదలు పెట్టారు. పాఠకులు సులువుగా త్రోసివేయకుండా, గాఢంగా ఆలోచిస్తారనే, నేను ఇవన్నీ చెబుతున్నాను. కార్మిక సేవ అనే పేరుతో యస్. కె. పటిల్, అశోకమెహతాలు అవలంబించిన ఈచర్యలను, వాటిని శంకరరావుదేవ్‌గారు సమర్థించడాన్ని నాగరిక పౌరులంతా గమనించాలి. అందుకే నేను పటిల్‌ముఠావారు చేసిన నేరాలను బహిరంగపరచుతున్నాను

శంకరరావ్‌దేవ్‌గారు మాట్లాడుతున్నపుడు కార్మికులు నిశ్శబ్దంగానే కూర్చున్నారు. "జపాను ఓటమికి చింతించుతున్నాను." అని శంకరావ్‌దేవ్‌గారు పల్కిన పలుకులు కాంగ్రెస్‌పాలసీకి అనుగుణ్యంగానే ఉన్నవా? అని ఒకరు ప్రశ్నించగానే మళ్ళీగలభా ప్రారంభమయింది. ఈప్రశ్న దేవ్‌గారికి చికాకు కల్గించి. గొంతుకు పట్టుకుంది లాఠీలు, కత్తిపోట్లు, రాళ్లరువ్వడం - ఇవీ పైప్రశ్నకి వచ్చిన జవాబులు. ఇష్టంవచ్చినట్లు రౌడీలు రువ్వినరాళ్ళఫలితంగా ప్రక్కనున్న సందుగొందులలో కూడ అనేకమంది దెబ్బలు తగిలాయి. ముఖ్యంగా గమనించవలసిన మరోవిషయం - ఎర్రజండా యూనియన్ కార్మికులందరికీ ఎక్కువగా తలలమీదరాళ్ళదెబ్బలు తగిలాయి. ఇప్పుడు ఎవరు ఎవరిపైరాళ్ళు విసిరారో సులభంగా గ్రహించుకోవచ్చు. వివిధ మిల్లులలో పనిచేసే ఎర్రజండా యూనియన్ కార్మికులకు 22 మందికి దెబ్బలుతగిలాయి. ఇద్దరు స్పృహతప్పి పడపోవడం మూలంగా వెంటనే హాస్పిటలులోచేర్చుకోవలసివచ్చింది. ఈ ఇద్దరులో ఒకరైన కామ్రేడ్ ఇంతియాజ్ ఖాన్‌ను ముంజేతులపై బాగా కొట్టడంవల్ల బొమికలు విరిగాయి.

కమ్యూనిస్టులపై తప్పంతా రుద్దటం, మీటింగును ఆర్గనైజ్ చేసినవారిని నిర్దోషులనడం, అసత్యానికి ఒడిగట్టుకోవడమవుతుంది. కమ్యూనిస్టులపై గావించేదండయాత్రలో ఇదొక భాగమేననీ, అబద్ధపు వార్తలనువిశ్వసించవద్దనీ ప్రజానీకాన్ని కోరుతున్నాను. అశోక మెహతా, పటిల్‌లాంటి కాంగ్రెసు వాదులు కార్మికసేవ పేరుతో ఎలాంటి కృత్యాలకు దిగుతున్నారో ప్రజలకు తెలియడంలేదు. పత్రికలు కూడా ఈ విషయంలో వారికే సహాయం చేయడంవల్ల అవి ప్రజలయొక్కగాని, కాంగ్రెసుయొక్క గాని, ప్రయోజనాలను పాటించడంలేదు.

కమ్యూనిస్టుపార్టీ ఎల్లపుడూ, వాక్స్వాతంత్ర్యాలనుకోరుతుందని పునరుద్ఘాటించుచున్నాను. కాంగ్రెసుపై నిషేధం తొలగించాలని, పౌరసత్వ హక్కులను నిలబెట్టాలనీ, మా పార్టీ ఆందోళన గావించింది.

ప్రజలు ప్రజాస్వామ్యపద్ధతుల ద్వారా రాజకీయ విభేదాలను పరిష్కరించుకోగలరని మాపార్టీకి విశ్వాసముంది. అందుచే, మా పార్టీ సానీ ఎన్నడూ మీటింగులలో అల్లరి చేయడంకాదు. కాని సభ్యతగల కాంగ్రెసు వారినందరినీ ఒక విషయం కోరుతున్నాం. కార్మిక వర్గానికి వ్యతిరేకులను, సంఘంలో ఎలాంటి స్థానానికి అర్హులుగాని రౌడీలను కార్మికులపైకి పంపవద్దని కోరుతున్నాం.

కాంగ్రెసు - కార్మికవర్గమూ సన్నిహితంగా రావాలనే ఆశయంతో పనిచేస్తున్న మాపార్టీ, ఈ దెబ్బలాటలు జరిగినందుకు విచారిస్తోంది. కాంగ్రెసు వాదులు స్వయంగా మాపైబురదగూర్చి తప్పుడుగా పదేపదే చిత్రించుతున్నటికి - కాంగ్రెసు - కార్మిక వర్గ ఐక్యతకోసమే మేం పాటుపడుతూ వచ్చాం. ఇప్పుడుకూడా అదే పాలసీని కొనసాగించుతాము 1–9–45

★

పై ప్రకటన కరపత్రాలను కామ్రేడ్లు బొంబాయిలో 2వ తేదీని పంచుతూండగా అనేక ప్రదేశాల్లో గూండాలు వచ్చి కొట్టారు. మహిళా కామ్రేడ్లుని కూడా కొట్టారు. కామ్రేడ్ మాలతి వగర్కార్‌ని ఒక రౌడీ కత్తితో పొడవబోయాడు. ఇంకొక కామ్రేడ్ అడ్డుకోబోతే అతనికి అరిచేతిలో కత్తి పోటు తగిలింది.

సోవియట్, చైనా ఒడంబడిక ప్రాధాన్యత

జపాన్ని ఓడించిన తరువాత ఆసియా ఖండాన్నంతటినీ తమ గుప్పెట్లో ఉంచుకోవాలని అభివృద్ధి నిరోధక పాలకవర్గాలు తలంచాయి. చైనాలో జాతీయైక్యత ఏర్పడకుండా చేసి, దాని నొక దుర్బలదేశంగా అట్టిపెట్టి అధికారం చెలాయించాలనీ; సోవియటుకి, ప్రజాస్వామిక ఉద్యమాలకు, వ్యతిరేకంగా తాము సాగించదలచిన పన్నాగాలకు దానిని కేంద్రంగా ఉపయోగించాలనీ వారి ఎత్తుగడ.

ఆయా దేశాల క్రితం ఆసియా వాసులకు మూడు మార్గాలు కనబడుతూ ఉండేవి :

1. జపాను ఫాసిస్టుల ప్లాను. దూర ప్రాచ్యమంతా సమాన భాగస్వాములయిన దేశాలుగ కలసివుండాలని ఆ ఫాసిస్టులు ప్రచారం చేశారు. కాని, నిజానికి ఆసియా అంతటా తమ సామ్రాజ్యాన్ని స్థాపించాలనే వారి ఆశయము.

2. సామ్రాజ్య వాదుల ప్లాను. పసిఫిక్కులో పైచేయి అమెరికా సామ్రాజ్యవాదానిది. తమ విమాన, నౌకాబలాధిక్యతవల్లనే జపానుని మట్టుపెట్టగలమనీ, సోవియట్ పసిఫిక్కు రంగంలో ప్రవేశించవలసిన అవసరం లేకుండా చేసుకోగలమనీ అమెరికా వారు ఆశించారు. చైనా అంతరంగిక వ్యవహారాల్లో కూడా జోక్యం కలిగించుకొని, కొమింటాంగు పార్టీలోని అభివృద్ధి నిరోధక వర్గాలకు పూర్తి మద్దతునిచ్చి, విముక్తి పొందిన ప్రాంతాల్లో కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన అభివృద్ధి పొందిన ప్రజాఉద్యమాలను అణచివేయాలని కూడా వీరి ప్లాను. జపాను మళ్ళా దురాక్రమణకు పాల్పడకుండా చేయడానికంటూ ఆసియాఖండంలో మిలిటరీ కేంద్రాలు సంపాదించుకొని తిష్టవేయాలని చూచారు. సోవియటుకి పక్కలో బల్లెంలాగా జపానులో అభివృద్ధి నిరోధకతత్వాన్ని పెంపొందించాలని అమెరికా వారి ప్లాను. అంతే కాదు. ఇటు చైనాలో ప్రజాఉద్యమాలను అణచివేస్తే కొమింటాంగు నియంతృత్వం బలపడి, చైనాలో జమీందారీవిధానం నాటుకు పోతుందనీ, ఆ విధంగా చైనా అమెరికా సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుందనీ, సోవియట్ వ్యతిరేక కుతంత్రాలకు ఉపయోగపడుతుందనీ వారి అంచనా.

3. సోవియటు, చైనా ప్రజాస్వామిక శక్తులు చూపిన మార్గం. జపాను సామ్రాజ్యవాదాన్ని రూపుమాపడం; ఐక్య ప్రజాస్వామిక చైనాను పర్చడం; ఆ చైనాకు సోవియటుకీ సన్నిహిత సంబంధం నెలకొల్పడం; ఆసియాఖండ స్వాతంత్ర్యోద్యమానికి ఆ చైనా నాయకత్వం వహించడం-ఇవీ ఈ ప్లానులోని అంశాలు.

ఈ మూడింటిలో మొదటి ప్లాను జపాను ఓడిపోవడంతో ధ్వంసమయింది. సోవియటు పసిఫిక్ రంగంలో ప్రవేశించడం, చైనాతో ఒడంబడిక కుదుర్చుకోవడం రెండవ ప్లానుకు గొడ్డలి పెట్టు పెట్టాయి; మూడవ ప్లాను జయప్రదం కావడానికి అవకాశాలు కలిగించాయి.

సారాంశము

సోవియట్ చైనా ఒడంబడిక సారాంశమేమిటి?

జపాను మిలిటరీ తత్వాన్ని రూపు మాపడానికి, ఇకెప్పుడూ జపాను దురాక్రమణకు పూనుకోకుండా చేయడానికి సోవియటు, చైనాలు కంకణంకట్టుకొన్నాయి. అంతేకాదు. ఈ రెండు దేశాల్లో దేనిమీదయినా దండయాత్ర జరిగినట్లయితే రెండవది వెంటనే దానికి అన్నివిధాలా తోడ్పడడానికి ఒప్పుకున్నాయి.

వీటి అర్థమేమిటి? జపానులో అభివృద్ధి నిరోధకత్వాన్ని పాలుపోసి పెంచి, ఆసియాలో ప్రజాస్వామ్యాన్ని నిరోధించాలని అమెరికా బ్రిటనులు ఆలోచించవచ్చు. అలాంటి కుతంత్రాలను సోవియట్, చైనాలు సర్వశక్తులతో ప్రతిఘటిస్తాయన్నమాట. మరో విషయం. ఒకరికి వ్యతిరేకంగాజరిగే కుట్రల్లో మరొకరు పాల్గొనమని సోవియట్ చైనాలు ఒప్పుకున్నాయి. దీనివల్ల సోవియట్ వ్యతిరేక కుతంత్రాలకు తనను కేంద్రాంగా ఉపయోగించగల అవకాశం ఎవ్వరికీ లేకుండాచేసింది చైనా.

ఈఒడంబడిక అమలులో నున్న 30 సంవత్సరాల్లోను, వలసదేశంగాఉన్న చైనానుఅధునిక పారిశ్రామిక దేశంగా అభివృద్ధిచేయడానికి సోవియట్‌యొక్క ఆర్థికబలము, పారిశ్రామిక నైపుణ్యము తోడ్పడ గలవు. ఆ విధంగా రెండు దేశాలకు యింకా ఎక్కువ భద్రత చేకూరగలదు. పోర్టుఆర్థరు నౌకాశ్రయాన్ని రెండు దేశాలు ఉపయోగించు కొంటాయి. డైరన్ నౌకా శ్రయాన్ని అన్ని దేశాల ఉపయోగానికి విడిచి పెడతాయి. మంచూరియా రైలుమార్గాలు సోవియట్, చైనాల ఉమ్మడి సొత్తుగా ఉంటాయి. దీనివల్ల మంచూరియాలో కూడా అమెరికా సామ్రాజ్యవాదుల ఆటలు సాగే అవకాశం లేకుండా పోతుంది.

ఈ 30 ఏళ్ళలో పోర్టు ఆర్థర్ నౌకాశ్రయంలోను, డైరెన్‌లోను, మంచూరియా రైలు మార్గాలమీద తానుచేసిన కొత్త నిర్మాణాలను అమర్చిన కొత్తయంత్రాలను-అన్నిటినీ అగడువులనంతరం చైనా ప్రజలకు అప్పగించేస్తానంది సోవియట్. ఇందుకేలాంటి ప్రతిఫలమూ అక్కర లేదనింది. అధునిక పారిశ్రామిక దేశానికి ఒక వలసదేశానికి మధ్య ఇలాంటి ఇచ్చి పుచ్చుకోవడాలు ఇదివరకు కనివిని ఎరుగము. ప్రజాశక్తులను బలపరచడంలో సోవియట్‌యొక్క చిత్తశుద్ధికి ఇది మరొక నిదర్శనం

అవుటర్‌మంగోలియా (మునుపు చైనాలో ఒక భాగం. తరువాత స్వతంత్ర రాజ్యంగా విడిపోయింది. సోవియట్‌తో చాల దగ్గర సంబంధం కలిగి, నిజమైన ప్రజాస్వామిక రాజ్యంగా అభివృద్ధి పొందిన దేశము) స్వాతంత్ర్యాన్ని చైనా గుర్తించింది. చైనా ప్రభుత్వం విషయంలో ఇది నిజంగా ప్రజాస్వామికచర్యే అనాలి.

యావత్తు చైనాపై సర్వాధికారం చైనా ప్రభుత్వానిదే అన్నసూత్రాన్ని ఈ ఒడంబడిక ముఖ్యంగా గుర్తింస్తూంది మూడు నెలల్లో సోవియట్ సేనలు మంచూరియాను ఖాళీచేసి, ఆదేశాన్నికూడా చైనా ప్రభుత్వ పరిపాలనకు విడిచిపెట్టడానికి సోవియట్ అంగీకరించింది.

విషప్రచారానికి జవాబు

సోవియట్, చైనా ఒడంబడిక యొక్క సారాంశమిది. ఆసియాఖండపు అభివృద్ధి మార్గంలో ఇదొక పెద్ద ముందడుగు. అభివృద్ధి నిరోధకులు దీనికి పెడర్థాలు కల్పిస్తున్నారు. సామ్రాజ్యవాదవార్తా సంస్థ అయిన "రాయిటర్" దీనినీవిధంగా వ్యాఖ్యానిస్తోంది: "చుంకింగు ప్రభుత్వంమీద తిరుగుబాటు చేయడానికి తమకు సోవియట్ సహాయంచేస్తుందని చైనాకమ్యూనిస్టులు ఆశించారు. పాపం, ఆ ఆశలు అడియాసలయాయి." (ఆగస్టు 28) ఇది వట్టితెలివితక్కువ వ్యాఖ్యానమే. చైనాలో ప్రజాస్వామ్యాన్ని స్థాపించడానికి అక్కడి కమ్యూనిస్టులు సోవియట్ సహాయంపై ఏనాడూ ఆధారపడలేదు. లోగడ తాను పంపే మిలిటరీ, ఆర్థిక సహాయాన్నంతా చుంకింగు ప్రభుత్వానికే పంపుతూ వచ్చింది సోవియటు. చైనా కమ్యూనిస్టులు స్టాలిన్ బంటులనే సామ్రాజ్యవాద విషప్రచారం ఎంత ఆధారరహితమో నేటిఒడంబడికచాటుతూంది.

ఈ ఒడంబడికను చైనా కమ్యూనిస్టులు హృదయ పూర్వకంగా ఆమోదిస్తారు ఎందువల్ల? చైనా కమ్యూనిస్టుల్ని, గెరిల్లా సేనంచేత విముక్తిచేయబడిన ప్రాంతాల్లోని 8 కోట్ల 50 లక్షల ప్రజల్ని అణగదొక్కడానికి చైనా అభివృద్ధి నిరోధకవర్గాలు అమెరికా సహాయాన్ని అర్థిస్తున్నారు. అమెరికావారి సహాయం లేనిది చైనా అభివృద్ధి నిరోధకులుతమనేమీ చేయలేరనేధైర్యం చైనా కమ్యూనిస్టులకుంది ఈవిషయంలో ఇకఅమెరికాజోక్యం కలిగించుకోడానికి వీలులేకుండా చేసింది ఈఒడంబడిక. ఎప్పుడైతేఅమెరికావారి అండ లేకుండా పోయిందో, ఆ మరుక్షణంలోనే చంగ్ - కై - షేక్ అతని పాలకవర్గమూ దిగివచ్చి తమతో తప్పకుండా ఒడంబడిక కుదుర్చుకుంటారని చైనా కమ్యూనిస్టులు గట్టిగా నమ్ముతున్నారు. ఈవిధంగా ప్రజాస్వామ్య ప్రాతిపదికపైని బలమయిన ఐక్య చైనాను నిర్మించడానికి ఈఒడంబడిక మహదవకాశం కలిగించిందని చైనా కమ్యూనిస్టులు సంతోషిస్తున్నారు.

చంగ్ - కై - షేక్‌కి, కమ్యూనిస్టునాయకుడయిన మావోత్సెటుంగ్‌కి అప్పుడే సంభాషణలు ప్రారంభమయాయి. సోవియట్-చైనా ఒడంబడికను తు చ తప్పకుండా అనుసరించడానికి చంగ్ సిద్ధంగా ఉన్నట్లయితే, ఈ సంభాషణలు నూతన ప్రజాస్వామిక చైనాకు పునాదులు కాగలవు ఆసియా ఖండానికంతకూ నాయకత్వం వహించగల మహోజ్వల చైనా నిర్మాణం పొందగలదు.

(పీపుల్సువార్ నుండి)

(మొదటిపేజీ తరువాయి)

కాని పై అంశాలలో ఒక్కటీ అజాదు ప్లానులో కనబడ్డంలేదు. నిజం చెప్పాలంటే, శాసనసభలకు జరుగనున్న యీ కొత్త ఎన్నికలూ, ప్రజా పరిషత్తు సభకు జరగవలసిన ఎన్నికలూ - రెండూ ఒకటేనని కోరటంలో కాంగ్రెసు నాయకులున్నారు.

లాహోరు కాంగ్రెసు ప్రచారకుల సభలో నెహ్రూ యిచ్చిన ఉపన్యాసం చూస్తే, యిదే స్పష్టమవుతూంది.

1932 లో సామ్రాజ్యవాదులు కమ్యూనల్ ఎవార్డుద్వారా ప్రతి రాష్ట్రానికి కొన్ని సీట్లను నిర్ణయించారు అలా ఏర్పరచబడిన అసెంబ్లీలనే ప్రజాప్రతినిధి పరిషత్తుసభలుగా వీరు ఎంచుతున్నారన్నమాట ముస్లింప్రజలు అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న రాష్ట్రాలను తీసుకొని, మౌలానాగారి సూచనలను అమలుపరచుటవల్ల ఫలితాలేమిటో పరిశీలించుతే, అదొక ఎన్నికల ఎత్తుగా అర్థమవుతుంది.

ఉదాహరణకు సరిహద్దురాష్ట్రం తీసుకుందాం. అక్కడి రాష్ట్రశాసనసభలో మొత్తం 50 స్థానాలున్నాయి. అందులో ముస్లిం స్థానాలు 36. ఇండియానుంచి సరిహద్దు రాష్ట్రం విడిపోవాలా? కలిసివుండాలా? అనే సమస్య చర్చకు వచ్చినప్పుడు, కలిసేవుండాలను తీర్మానం నెగ్గడానికి కాంగ్రెసు 12 ముస్లిం స్థానాలను సంపాదించితే చాలు. మిగతా 14 గురు సభ్యులూ, సహజంగా కలిసే ఉండడానికి వోట్లిస్తారు అంటే, 12 గురు కాంగ్రెసుముస్లింలు 100 కి 82 మంది చొప్పున వున్న ముస్లింప్రజల భవిష్యత్తును నిర్ణయించగల్గుతారన్నమాట! ఇలాగే పంజాబులో వున్న ముస్లిం స్థానాలలో 100 కి 15, పంజాబులో 100 కి 10 స్థానాలు. కాంగ్రెసుకు వస్తే, పాకిస్తాన్ తీర్మానం ఓడిపోతుంది. బెంగాల్‌లో ముస్లిం స్థానాలన్నీ (119) లీగ్‌కే వచ్చినా, పాకిస్తాన్ తీర్మానాన్ని ఓడించవచ్చు. ఎందువల్లనంటే బెంగాలుకు మొత్తం 250 సీట్లు.

ఇదంతా లీగ్ నాయకులకు తెలుసు. కనుకనే, పాకిస్తాన్ సమస్యపై జరిగేనిర్ణయం ఒక ముస్లిం ప్రజాభిప్రాయంమీదే ఆధారపడి ఉండాలని వారు కోరుతూవచ్చారు ఇతరులకిప్రాతినిధ్యంలో నిమిత్తం ఉండకూడదంటున్నారు రేపు జరిగే ఎన్నికలలో ముస్లింలీగ్‌కే ఎక్కువ స్థానాలు (ముస్లిం సీట్లలో) వస్తాయని వీరి గట్టినమ్మకం అప్పుడుముస్లింలు మెజారిటీగా వున్న అన్ని రాష్ట్రాలు ఇండియానుంచి విడిపోవాలనీ, అవన్నీకలిసి ఒక కొత్త కేంద్రప్రభుత్వంలో చేరుతాయనీ, లీగ్‌ప్రకటిస్తుంది. ఇప్పుడున్న కేంద్రంలో చేర నిరాకరిస్తుంది. కాని, అదేసమయంలో కాంగ్రెసు పాకిస్తాన్ తీర్మానాన్ని ఒక్కొక్క రాష్ట్రశాసనసభలోను ఓడించగల్గుతుంది. ఈవిధంగా దేశంలోతిరిగి ప్రతిష్ఠంభన ప్రారంభమవుతుంది తిరిగి బ్రిటిష్ పాలకవర్గం చేతుల్లోనే అంతిమ నిర్ణయాధికారం ఉంటుంది. అలాంటి పరిస్థితిలో ప్రతిపార్టీ రెండవపార్టీని ఓడించడానికి ప్రభుత్వాన్ని దేవురించవలసి వస్తుంది ఇంగ్లండులో బ్రిటిష్ దోరల ఒత్తిడి ఎక్కువై, కూప్లెండ్ ప్లానువంటి ప్లానులతో ఇండియామీదమరొక దాసివాజ్యాంకచట్టాన్నిరుద్దవచ్చు ఈప్రమాదాన్ని కాంగ్రెసు, ముస్లింలీగు గుర్తించి, సంయుక్త కార్యాచరణకు పూనుకోవలసిందని కోరుతున్నాను.

Editor : M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada

END OF ISSUE